PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 77 | విజయవాడ, శుక్రవారం 18 అక్టోబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 18 October 2024 | Rs

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట

- రాజ్యాంగ దినోత్సవం రోజున దేశవ్యాప్త ఆందోళనలు
- కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

5



టీమిండియా ఢమాల్

6

46 పరుగులకే కుప్పకూలిన రోహిత్ సేన • న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్

కౌలు చట్టం ఆలస్యం?

- కేబినెట్‌కు రాని అంశం • బ్యాంకర్ల మీట్‌లోనూ చర్చ లేదు • యాక్ట్‌పై కొత్త సందేహాలు
- రబీ నుంచేనన్న ప్రభుత్వం • కొత్త కార్డులేక, పాతవి ఇవ్వక వాస్తవ కౌలు రైతుల అవస్థ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కౌలు రైతుల సంక్షేమం లక్ష్యంతో టిడిపి కూటమి ప్రభుత్వం తెస్తామన్న కొత్త కౌలు చట్టం ఆలస్యమయ్యేటట్లు కనిపిస్తోంది. చట్టం ముసాయిదాపై అభిప్రాయసేకరణ కోసం సర్కారు మీటింగ్‌లు నిర్వహించింది. గుంటూరులో ఇటీవల సమావేశం నిర్వహించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వచ్చే మంత్రి మండలి భేటీలో కొత్త కౌలు చట్టాన్ని ఆమోదిస్తామని, అనంతరం అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెడతామని తెలిపారు. కాగా బుధవారం జరిగిన కేబినెట్ భేటీలో కౌలు చట్టం అంశం అజెండాలో రాలేదు. దాంతో కౌలు చట్టం రావడానికి ఆలస్యమవుతుందని వినవస్తోంది. ఇదిలా ఉండగా గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బిసి) సమావేశంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు ప్రభుత్వం తీసుకు రానున్న కొత్త కౌలు చట్టం గురించి మాటమాత్రం ప్రస్తావించలేదు. కౌలు రైతులకు మానవతా దృక్పథంతో రుణాలివ్వాలని బ్యాంకులను కోరారు. ఈ పరిణామాలు చట్టంపై కౌలు రైతుల్లో కొత్త సందేహాలు రేకెత్తిస్తున్నాయి.

ఆర్డినెన్స్‌కు అవకాశం ఉన్నా..

రబీ నుంచి కౌలు రైతులకు కొత్త గుర్తింపు కార్డులిస్తామని, రెవెన్యూ శాఖ నుంచి కాకుండా వ్యవసాయశాఖ నుంచి ఇప్పిస్తామని కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంలో సెప్టెంబర్‌లో నిర్వహించిన కేబినెట్‌లో హామీ ఇచ్చింది. ఖరీఫ్ ముగిసి రబీ మొదలవుతున్న వేళ కౌలు రైతులు రుణాల కోసం వెతుకులాడుతున్నారు. వర్షాలు, వరదల వలన పంటలు నష్టపోయిన కౌలు రైతులు ప్రభుత్వ పరిహారం కోసం, బీమా కోసం ఎదురు చూస్తున్నారు. కొత్త చట్టం రాక, పాత చట్టం ప్రకారం సిసిఆర్‌సిలు జారీ కాక కౌలు రైతులు అటు బ్యాంక్ రుణాలకు ఇటు ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి సాయాన్ని, సంక్షేమ



ఎస్‌ఎల్‌బిసి నివేదికను విడుదల చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

పథకాలను కోల్పోతున్నారు. పాత సిసిఆర్‌సిల జారీని నిలిపివేసిన నేపథ్యంలో రబీలో అత్యవసరంగా కౌలు రైతులను ఆదుకోవడం కోసం అసెంబ్లీ సమావేశాల వరకు వేచి చూడకుండా ఆర్డినెన్స్ తీసుకొచ్చి, కొత్త చట్టాన్ని అమలు చేసే వీలుంది. ఆ ప్రయత్నం జరగలేదు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కోసం ఆర్డినెన్స్ జారీ చేసిన సర్కారు, కౌలు చట్టానికి అంతే ప్రాధాన్యమిచ్చి ఆర్డినెన్స్ ఇవ్వొచ్చన్న మిగతా 2లో

కౌలు రైతులకు మానవతా దృక్పథంతో లోన్లు : బ్యాంకులకు మంత్రి విజ్ఞప్తి

కౌలు రైతులకు బ్యాంకులు మానవతా దృక్పథంతో రుణాలివ్వాలని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు కోరారు. కౌలు రైతులకు 9 లక్షల సిసిఆర్‌సిలు ఇవ్వగా 2 లక్షల మందికే లోన్లు ఇచ్చారన్నారు. రానున్న ఐదేళ్లల్లో 50 లక్షల ఎకరాలను ప్రకృతి సేద్యం కిందకు తీసుకొచ్చే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన ఎస్-ఎల్‌బిసి 228వ సమావేశంలో 2024-25 వార్షిక రుణ ప్రణాళికలో తొలి మూడు మాసాల రుణ వితరణపై సమీక్షించారు. రాష్ట్రంలో 65 శాతం మంది వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడ్డారని, ఆ వర్గాలకు బ్యాంకులు తగిన తోడ్పాటు అందించాలని మంత్రి కోరారు. ప్రభుత్వం ఆరు విధాన రంగాలను ప్రోత్సహిస్తోందని, వాటిలో ఎంఎస్‌ఎంఇ ప్రధానమైనదని, ఆ రంగానికి బ్యాంకులు అప్పులిచ్చి ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై ప్రజల్లో సరైన అవగాహన ఉండట్లేదని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వం వివిధ రంగాలకు కేటాయించిన నిధులను వేరే రంగాలకు మళ్లించి ఆయా రంగాలను నిర్వీర్యం చేసిందని, పరిస్థితులను గాడిలో పెడుతున్నామని వివరించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను యూనియన్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ మణిమేఖలై ప్రశంసించారు. 2024-25 క్రెడిట్ ప్లాన్ రూ.3.75 లక్షల కోట్లు కాగా తొలి త్రైమాసికంలో 1.36 లక్షల కోట్ల లోన్లిచ్చామని వివరించారు. వ్యవసాయశాఖ స్పెషల్ సిఎస్ బి రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కౌలు రైతులే 90 శాతం భూమిని సాగు చేస్తున్నారని, వారికి సక్రమంగా రుణాలందట్లేదని, సిసిఆర్‌సిలు కలిగిన వారందరికీ బ్యాంకులు రుణాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలువురు బ్యాంకర్లు, అధికారులు పాల్గొన్నారు.



ఉప్పాడలో అలల తాకిడికి ధ్వంసమైన మత్స్యకార గృహాలు

తప్పిన 'గండం'

• పొన్నేరి వద్ద తీరం దాటిన వాయుగుండం • 22న మరో అల్పపీడనం!

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గురువారం తెల్లవారుజామున తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం పొన్నేరి వద్ద తీరం దాటింది. దీంతో దక్షిణ కోస్తా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఉద్యాన, పత్తి, మిర్చి పంటలకు కొంతమేర నష్టం వాటిల్లింది. నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణంలో రెండు మట్టి మిద్దెలు కూలిపోయాయి. ఉప్పాడలో సముద్రపు అలలు ఎగిసిపడడంతో 50 మత్స్యకారుల ఇళ్లు ధ్వంసమయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా చినమైనవానిలంక, పెదమైనవానిలంకలో సముద్రపు అలలు ఎగిసిపడుతున్నాయి.

తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలో 102, డక్కిలిలో 62, బాలాయపల్లిలో 92 చెరువులు, కుంటలు క్రమంగా నిండుతున్నాయి. సోమవారం నుంచి బుధవారం వరకు నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 226.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రకాశం జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం కురిసినా.. తీరం దాటాక వర్షం ఆగిపోయింది. యర్రగొండపాలెం ప్రాంతంలో పత్తి, మిరప తోటలు ఉరకలెత్తాయి. పత్తి తీసేందుకు సిద్ధంగా ఉన్న పొలాల్లో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పత్తి అంతా నేలమట్టమైంది. దీంతో పాటు పూత, పిందె రాలిపోయాయి. ఉమ్మడి కర్నూలులో మోస్తరు వర్షం పడింది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణం నాగులకట్ట వీధికి చెందిన జించ చిన్నహుసేన్‌వల్లికి చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. అయితే ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఇదే మండలానికి చెందిన మల్లెవేముల గ్రామంలో కసెట్టి హరిప్రసాద్‌కు చెందిన మట్టి మిద్దె కూలిపోయింది. నందికొట్కూరు పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జల మయమయ్యాయి. శ్రీకాకుళంలో పలుచోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వజ్రపు కొత్తూరు మండలంలో 60.75 మి.మీ వర్షపాతం నమోదైంది. కవిటి మండలం ఇద్దివానిపేట, గార మండలం బందరువానిపేట ప్రాంతంలో 120 మీటర్ల వరకు సంద్రం ముందుకు వచ్చింది.

50 మత్స్యకారుల ఇళ్లు ధ్వంసం

వాయుగుండం కారణంగా రెండు రోజుల నుంచి కాకినాడ జిల్లా యు. కొత్తపల్లి మండలం ఉప్పాడలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. సూరాడపేట, మాయాపట్నం, కోనపాపపేట గ్రామాల్లో నివాసం ఉంటున్న మత్స్యకార కాలనీల్లోకి సముద్రపు అలలు ఎగిసిపడ్డాయి. అలల ఉధృతికి 50 వరకూ మత్స్య కారుల ఇళ్లు ధ్వంసమయ్యాయి. మత్స్యకారుల ఇళ్లను కాకినాడ ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు గురువారం పరిశీలించారు. నివేదిక తయారుచేసి ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తానని మత్స్య కారులకు ఆయన హామీ ఇచ్చారు. పునరావాస మిగతా 2లో



తదుపరి సిజెఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా...!

- కేంద్రానికి సిఫారసు చేసిన సిజెఐ డివై చంద్రచూడ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తదుపరి భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులు కానున్నారు. సీనియారిటీ ప్రాతిపదికన ఆయన పేరును ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ ప్రభుత్వానికి బుధవారం సిఫారసు చేశారు. చీఫ్ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నవంబర్ 10న రిటైర్ కానున్నారు. ఈలోగా నూతన సిజెఐ ప్రక్రియ ముగించాల్సి ఉంటుంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, ప్రధాన న్యాయమూర్తి నియామకానికి సంబంధించిన నిబంధనావళి ప్రకారం, ప్రస్తుత సిజెఐ అధ్యక్షతన గల కొలీజియం తదుపరి ప్రధాన న్యాయమూర్తి పేరును ఖరారు చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం మిగతా ప్రక్రియ పూర్తి చేస్తుంది. ప్రస్తుత సిఫారసులను కేంద్రం ఆమోదిస్తే... దేశ 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యతలు చేపట్టనున్నారు. 2019 జనవరి 18న ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన పదోన్నతి పొందారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు లోక్‌సభ ఎన్నికల సమయంలో జస్టిస్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. ఆయనకు రాజ్యాంగచట్టాలు, ప్రత్యక్ష పన్నులు, కమర్షియల్ లా, కంపెనీ లా, పర్యావరణ చట్టాలు ఇలా అనేక విభాగాల్లో నిష్ణాతుడిగా పేరుంది. అయితే సిజెఐగా మిగతా 5లో



రైల్వే అడ్వాన్స్ రిజర్వేషన్ గడువు 60 రోజులకు కుదింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైల్వేలో అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం 120 రోజుల నుంచి 60 రోజులకు రైల్వే మంత్రిత్వశాఖ కుదించింది. ఈ మేరకు రైల్వే మంత్రిత్వశాఖ అన్ని రైల్వే జోనల్ మేనేజర్లకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రిజర్వేషన్ కుదింపు ప్రక్రియ నవంబరు ఒకటి నుంచి అమల్లోకి రానుంది. ఇప్పటికే ఎఆర్‌పి 120 రోజుల ప్రక్రియలో 31.10.24 వరకు చేసిన రిజర్వేషన్లు అలానే ఉంటాయన్నారు. 60 రోజులు దాటిన తేదీల్లో చేసిన రిజర్వేషన్లు రద్దు చేయబడతాయని తెలిపారు. తాజ్ ఎక్స్‌ప్రెస్, గోమతి ఎక్స్‌ప్రెస్ నిర్దిష్ట పగటి పూట ఎక్స్‌ప్రెస్ రైళ్ల విషయంలో ఎటువంటి మార్పు ఉండదని తెలిపారు. ఇక్కడ ముందస్తు రిజర్వేషన్ల కోసం తక్కువ సమయ పరిమితులు ప్రస్తుతం అమల్లో ఉన్నాయని పేర్కొన్నారు. విదేశీ పర్యాటకులకు 365 రోజుల పరిమితి విషయంలో ఎలాంటి మార్పు ఉండదని తెలిపారు.

పారిశ్రామిక విధానాలపై కార్మిక సంఘాలతో చర్చించాలి

- నవంబర్ 8 నుంచి 15 వరకూ ప్రజాపోరు : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న పారిశ్రామిక విధానాలపై కార్మిక సంఘాలతో సమగ్రంగా చర్చించాలని, ఆ తర్వాతే తుది రూపం ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కాకినాడ సుందరయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతే లక్ష్యమంటూ ప్రభుత్వం ఆరు కొత్త పాలసీలను ప్రకటించడాన్ని, ఇందులో భాగంగా 20 లక్షల ఉద్యోగాలతో పాటు రూ.30 లక్షల కోట్లు పెట్టుబడులు రాబోయే ఐదేళ్లలో వస్తాయని చెప్పడాన్ని ప్రస్తావించారు. గతంలో మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో సమావేశం పెట్టి రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రకటించారని, ఇప్పుడు చంద్రబాబు రూ.30 లక్షల కోట్లు అంటున్నారని విమర్శించారు. 20 లక్షల

ఉద్యోగాల సంగతి పక్కన పెడితే ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. నాలుగు నెలలు గడిచినా డిఎస్‌సి ఊసే లేదన్నారు. రాష్ట్రంలో 2.50 ఎకరాలను సెజ్ పేర సేకరించారని, నేటికీ ఇవి ఖాళీగానే ఉన్నాయని తెలిపారు. వాటిలో పరిశ్రమలను నెలకొల్పాలని లేదా తిరిగి రైతులకు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. 2008లో ఏర్పడిన కాకినాడ సెజ్‌లో ఇప్పటికీ ఒక్క పరిశ్రమ కూడా స్థాపించలేదన్నారు. నేడు వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందని అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరలు ప్రకటించిందని, వరికి మాత్రం పెంచలేదన్నారు. ప్రకృతి వనరులను కార్పొరేట్ల పరం చేసేందుకే మోడీ పనిచేస్తున్నారని విమర్శించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రజల ఆమోదం లేకుండానే వందల ఎకరాలను ఆదానీకి కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. విశాఖ సెజ్‌లో రాత్రికి రాత్రి లాకౌట్ ప్రకటించడంతో 1000 మంది కార్మికులు వీధిన పడ్డారన్నారు. హిందూపురం, కాకినాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో వేలాదిమంది మహిళలు 14 గంటల పాటు పని చేస్తున్నా కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. నేడు ఈ పరిశ్రమలు చాలా వరకూ మూతపడుతున్నాయని తెలిపారు. ఉన్న పరిశ్రమలు మూతపడుతుంటే కొత్త పరిశ్రమలు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. పారిశ్రామిక విధానాల కంటే ముందుగా వ్యవసాయ విధానాలను ప్రకటించాలన్నారు. కాకినాడ జిల్లాలో పది వేల మంది మత్స్యకారులు నేటికీ వేట నిషేధ పరిహారం అందలేదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు, కాకినాడ జిల్లా సిపిఎం కన్వీనర్ ఎం. రాజశేఖర్, నాయకులు దువ్వా శేషబాబ్జి, కెఎస్.శ్రీనివాస్, కరణం ప్రసాదరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు కార్యాలయాల వద్ద ధర్నాలు

ట్రూ ఆఫ్ ఛార్జీల రద్దు కోసం శుక్రవారం విద్యుత్తు కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. ప్రజా సమస్యలు, అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ ఎనిమిది నుంచి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన మద్యం పాలసీ వల్ల ఇష్టారాజ్యంగా మద్యం దుకాణాలు వెలుస్తున్నాయన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేని చోట వీటిని ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో గ్రామ సభల అనుమతితోనే షాపులు ఏర్పాటు చేయాలన్నారు.

పెట్టుబడిదారులకు రెడ్‌కార్పెట్

సిఎం చంద్రబాబు ట్వీట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని సిఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులను స్వాగతించేందుకు రెడ్ కార్పెట్ పరిచి ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ట్వీట్ చేశారు. రాష్ట్రంలో వ్యాపార అనుకూల ప్రభుత్వం ఉందని, ప్రతిభావంతులైన యువకులు బలమైన మౌలిక సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. కొత్త పాలసీ ఫ్రేమ్‌వర్క్ పరిశ్రమ అనుభవజ్ఞులతో సమగ్ర సంప్రదింపుల ఆధారంగా రూపొందిచామన్నారు. పాలసీ ఫ్రేమ్‌వర్క్ రాష్ట్రంలో వ్యాపారాలను, వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. దేశంలో అత్యుత్తమ వ్యాపార పర్యావరణ వ్యవస్థను నిర్మించబోతున్నట్లు పేర్కొన్నారు. వ్యక్తిగతంగా తాను పెట్టుబడులు పెట్టేవారికి హామీ ఇవ్వాలనుకుంటున్నానని, దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యంగా మన రాష్ట్రంలో ఇంతకంటే మంచి సమయం ఎప్పుడూ లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి ప్రయాణంలో సహకరించాలని పెట్టుదారులకు విజ్ఞప్తి చేశారు. మీ వ్యాపార పరిధులు, రాష్ట్ర సామర్థ్యం రెండింటినీ విస్తరించవచ్చుని, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చేవారి కోసం ఎదురుచూస్తున్నట్లు సిఎం తెలిపారు.

పారిశ్రామిక అభివృద్ధిలో కొత్త అధ్యాయం

- సిఎంకు ఎపి ఛాంబర్స్ ప్రత్యేక అభినందనలు

2లో..

జమిలీని ఎదుర్కొందాం

- వైసిపి రాష్ట్ర కార్యవర్గంలో అధ్యక్షులు జగన్
- టిడిపి హామీలకు పాలనకు పొంతన లేదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ, పార్లమెంటుకు జమిలీ ఎన్నికలు జరుగుతాయని అంటున్నారని, వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో పార్టీ ఓటమి అనంతరం తొలిసారి వైసిపి రాష్ట్ర వర్క్‌షాపును తాడేపల్లిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు వ్యవస్థీకృతంగా వ్యవహరిస్తేనే సమర్థవంతంగా జమిలీ ఎన్నికలను ఎదుర్కోగలమని చెప్పారు. త్వరలోనే అన్నిస్థాయిల్లోనూ పార్టీ కమిటీలు ఏర్పాటు కావాలని అన్నారు. ఎన్నికలకు ముందు టిడిపి ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం జరుగుతున్న పాలనకు పొంతన లేదని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం అతి తక్కువ సమయంలో వైఫల్యం దిశగా వెళ్తోందని అన్నారు. ఈ సమయంలో పార్టీ నాయకత్వం ఐక్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వాన్ని ఎదుర్కోవడం పెద్ద



మాట్లాడుతున్న మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

సమస్య కాదని చెప్పారు. అక్రమ కేసులు పెడితే ఎదుర్కొని ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. గతంలో ఏమైనా తప్పులు చేసి ఉంటే వాటిని సరిదిద్దుకునేందుకు ఇదే సరైన సమయమన్నారు. క్షేత్రస్థాయి నిర్మాణంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. . రాష్ట్రంలో 86 శాతం సర్పంచ్‌లు, 90 శాతం పైచిలుకు ఎంపిటిసిలు వైసిపి వాళ్లే ఉన్నారని అన్నారు. నాయకత్వం ఇంట్లో కూర్చుంటే కుదరదని, చొరవ తీసుకుని అన్ని అంశాలపై స్పందించాలని తెలిపారు. అన్యాయంపై ప్రశ్నించడంతోపాటు బాధితులకు అండగా నిలవాలని పేర్కొన్నారు. వైసిపి ఎన్నికల మ్యానిఫెస్టోను ఖచ్చితంగా అమలు చేసిందని, టిడిపి చేయలేకపోతోందని, పైగా ఎదురుదాడి చేస్తోందని, సోషల్ మీడియాను వాడుకుంటోందని తెలిపారు. పార్టీలో మిగతా 2లో

సిఎస్‌కు రిపోర్టు చేసిన నలుగురు ఐఎఎస్‌లు

- టిఎస్ సిఎస్‌కు రిపోర్టు చేసిన ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరు సృజన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి కేడర్‌కు చెంది, తెలంగాణలో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఐఎఎస్ అధికారులు గురువారం సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు రిపోర్టు చేశారు. రిపోర్టు చేసిన వారిలో ఆమ్రపాలి, రోనాల్డ్‌రోస్, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్ ఉన్నారు. ఇటీవల డిఒపిటి తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యి ఎపిలో రిపోర్టు చేయాలని ఆదేశించినప్పటికీ నలుగురు ఐఎఎస్ అధికారులు క్యాట్‌ను ఆశ్రయించారు. అక్కడ వీరికి చుక్కెదురు కావడంతో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. డిఒపిటి ఆదేశాలపై జోక్యం చేసుకునేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించడంతో వీరు సిఎస్‌కు రిపోర్టు చేశారు. అదే విధంగా తెలంగాణ ఐఎఎస్ కేడర్‌కు చెందిన ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరు సృజన డిఒపిటి ఉత్తర్వులు మేరకు రాష్ట్రంలో రిలీవ్ అయ్యి తెలంగాణ సిఎస్ వద్ద రిపోర్టు చేశారు.


రాజధానికి 30 కన్సల్టెన్సీలు

- త్వరలో సంస్థల నియామకం
- టెండర్లు పిలవనున్న సిఆర్‌డిఎ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా సిఆర్‌డిఎ పరిధిలో వేర్వేరు కంపెనీలకు 30 కన్సల్టెన్సీలను నియమించేందుకు సిఆర్‌డిఎ సిద్ధమైంది. దీనిలో భాగంగా త్వరలోనే టెండర్లు పిలవనున్నారు. రాజధానిలో చేపట్టే ప్రతి పనికీ ఒక కన్సల్టెన్సీని నియమించాల్సి ఉంది. ఆ సంస్థ ఇచ్చే డిపిఆర్ ఆధారంగా పనులు చేయాల్సి ఉంటుంది. ప్రపంచబ్యాంకు నిధులిచ్చే ఈ పనికైనా ఇది తప్పనిసరి. కన్సల్టెన్సీల నియామకంపై ఇటీవల కసరత్తు నిర్వహించారు. మొత్తంగా 32 సంస్థలను నియమించుకోవాల్సి ఉందని నిర్ణయించారు. నవంబరు, డిసెంబర్ నెలల్లో పనులకు టెండర్లు పిలవాల్సి ఉన్న నేపథ్యంలో ముందుగానే కన్సల్టెన్సీని నియమించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా నియామకానికి సిఆర్‌డిఎ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆయా సంస్థలను కూడా టెండర్ పద్ధతిలోనూ నియమించాల్సి ఉంటుంది. వీటికి ఈ వారంలో టెండర్లు పిలిచే అవకాశం ఉంది. ఇటీవల పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ సిఎంను కలిసిన సమయంలోనూ కన్సల్టెన్సీల అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. వీలైనంత త్వరగా నియమించాలని నిర్ణయించిన నేపథ్యంలో ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రస్తుతం సిఆర్‌డిఎ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఎంత ఖర్చవుతుందని లెక్కలు రూపొందించారు. ఒకటి రెండు రోజుల్లో దీనిపై సమగ్ర నివేదిక రానున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఒకటి రెండు సంస్థలను ఆమోదించారు. గతంలో ఇక్కడే పనులు చేపట్టిన ఆర్‌వి అసోసియేట్స్, కెఎంసి ప్రాజెక్టు వంటి వాటి నియామకాలు పూర్తయ్యాయి. మిగిలిన వాటి నియామకం కూడా వీలైనంత త్వరగా చేస్తామని అధికారులు చెబుతున్నారు.



హమాస్ చీఫ్ సిన్వార్‌ను చంపేశాం

- ఇజ్రాయిల్ ప్రకటన
- ఇంకా ధ్రువీకరించని హమాస్

2

విచారణకు హాజరైన సజ్జల

- 38 ప్రశ్నలు సంధించిన అధికారులు
- సమాధానాలు దాటవేత : సిఐ


విచారణకు హాజరవుతున్న సజ్జల రామకృష్ణా రెడ్డి

ప్రజాశక్తి మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)
టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైసిపి నాయకులు సజ్జల రామకష్ణారెడ్డి గురువారం గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఆయనను మంగళగిరి డిఎస్‌పి మురళీకృష్ణ, రూరల్ సిఐ శ్రీనివాసరావు విచారించారు. సజ్జల వెంట విచారణకు హాజరయ్యేందుకు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డిని పోలీసులు అనుమతించలేదు. విచారణ అనంతరం రూరల్ సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తమ వద్ద ఉన్న ఆధారాలతో ముందుగా సిద్ధం చేసుకున్న 38 ప్రశ్నలు అడిగామని చెప్పారు. చాలా ప్రశ్నలకు గుర్తు లేదనే సమాధానం ఇచ్చారని తెలిపారు. సజ్జలను ఫోన్ అడిగినా ఇవ్వలేదన్నారు. విచారణకు ఆయన సహకరించలేదనీ తెలిపారు. ఘటన జరిగిన రోజు తాను అక్కడ లేనని తెలిపినట్లు చెప్పారు. ఈ కేసులో సజ్జల పాత్ర ఉన్నట్లు మా వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. మూడు నెలలుగా పలువురిని విచారించామని, దర్యాప్తు దాదాపు చివరి దశకు వచ్చిందన్నారు. చాలా మంది నిందితులు కోర్టుల ద్వారా రక్షణ పొందారని, దీనివల్ల కేసు విచారణ వేగంగా జరగట్లేదనీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేస్తే విచారణ త్వరగా పూర్తవుతుందని తెలిపారు. కేసును ప్రభుత్వం సిఐడికి ఇచ్చిందని, ఉత్తర్వులు రాగానే విచారణ దస్త్రాలను సిఐడికి అప్పగిస్తామని సిఐ శ్రీనివాసరావు ప్రకటించారు.

ప్రజల దష్టి మళ్లించడానికే వేధింపులు : సజ్జల
ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వాటి నుంచి దష్టి మళ్లించడానికి వైసిపి నేతలను ప్రభుత్వం అక్రమ కేసులతో వేధిస్తోందని సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. నందిగం సురేష్‌ను అరెస్టు చేశారని, బెయిలు వచ్చినా మరో కేసు పెట్టి అరెస్ట్ చేశారని తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేకపోయినా ప్రతిపక్షం లేకుండా చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు.

మాజీ ఎంపి ఎంవివికి ముందస్తు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి
విశాఖ, యండాడలోని హయగ్రీవ భూముల వివాదంపై అరిలోవ పోలీసులు పెట్టిన కేసులో మాజీ ఎంపి, పారిశ్రామికవేత్త ఎంవివి సత్యనారాయణ, చార్టెర్డ్ అకౌంటెంట్ గన్నమనేని వెంకటేశ్వరరావు, బిల్డర్ గద్దె బ్రహ్మాజీలకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.30 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలి. ప్రతినెలా 1, 15వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు మూడు నెలలపాటు దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలి. దర్యాప్తు అధికారికి అందుబాటులో ఉండాలి. బయటకు వెళుతున్నపుడు దర్యాప్తు అధికారి అనుమతి పొందాలి. కేసుకు చెందిన వారిని ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ బెదిరించరాదు. భయపెట్టడం, ప్రలోభపెట్టడం వంటివి చేయరాదు వంటి షరతులు విధిస్తూ జస్టిస్ విఆర్ కృపాసాగర్ గురువారం తీర్పు చెప్పారు.
యండాడలో అనాథ శరణాలయం, వృద్ధాశ్రమం, వృద్ధులకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి తీసుకున్న 12.5 ఎకరాల భూమి విషయంలో ఫోర్జరీ చేశారని హయగ్రీవ కన్స్ట్రక్షన్స్ అధినేత జగదీశ్వరుడు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పిటిషనర్లకు ముందస్తు బెయిల్ లభించింది.

సవరణ
'ప్రగతే లక్ష్యంగా కొత్త పాలసీలు' శీర్షికన గురువారం మొదటిపేజీలో ప్రచురితమైన వార్త ఇన్‌సెట్‌లో రూ.30 లక్షల పెట్టుబడులు అని ప్రచురితమైంది. దీనిని రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు అని చదువుకోగలరు.

నందిగం బెయిల్ పిటిషన్‌లో పోలీసులకు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి
మరియమ్మ అనే మహిళ హత్య కేసులో బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి మాజీ ఎంపి నందిగం సురేష్ దాఖలు చేసిన పిటిషన్‌లో పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కేసుకు చెందిన వివరాలను అందజేయాలని పేర్కొంది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ విఆర్ కృపాసాగర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. 2020 డిసెంబరు 27న తుళ్లూరు మండలం, వెలగపూడిలో జరిగిన ఘర్షణలో మరియమ్మ మరణంపై ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టయిన నందిగంకు బెయిల్ ఇచ్చేందుకు కింది కోర్టు నిరాకరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

పట్టాలు తప్పిన లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ రైలు

గౌహతి : అస్సోంలోని దిమా హసావో జిల్లాలో లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. అగర్తలా నుంచి ముంబయికి బయల్దేరిన ఈ రైలు.. పవర్‌కార్, ఇంజిన్‌తో పాటు 8 బోగీలు పట్టాలు తప్పాయి. అస్సోంలోని దిబలోంగ్ వద్ద గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదని రైల్వే అధికారులు వెల్లడించారు. గురువారం మధ్యాహ్నం 3:55 గంటలకు జరిగిన ఈ రైలు ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదన్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందగానే.. సహాయక బృందాలు అక్కడకు చేరుకున్నాయన్నారు. ఈ ఘటనతో లుమ్‌డింగ్-బాదర్‌పూర్ సింగిల్-లైన్ హిల్ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలు నిలిపేసినట్లు తెలిపారు.

వైసిపిలో మురళీకృష్ణంరాజు చేరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
టిడిపి రాష్ట్ర కార్యదర్శి ముదునూరి మురళీకృష్ణంరాజు వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో గురువారం చేరారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన రాజు ప్రస్తుతం అమలాపురం నియోజకవర్గ టిడిపి పరిశీలకుడిగా బాధ్యతల్లో ఉన్నారు. ఆయనకు జగన్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సుబాష్‌చంద్ర బోస్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విజయసాయి రెడ్డి, వైవి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌలు చట్టం ఆలస్యం?

(మొదటిపేజి తరువాయి)
వాదనలు వినిపిస్తున్నాయి.
బ్యాంకులదే కీలక పాత్ర
ప్రభుత్వాలు చట్టాలు చేసి కౌలు రైతులకు గుర్తింపు కార్డులిస్తున్నా బ్యాంకులు వాటిని పట్టించుకోవట్లేదు. ఒకే భూమిపై రెండు రుణాలు, రికవరీ గ్యారంటీ వంటి కొర్రీలు వేసి కౌలు రైతులకు పంట రుణాలివ్వట్లేదు. 2011- చట్టం తీసుకొచ్చే సమయంలో బ్యాంకులతో అప్పటి ప్రభుత్వం విస్తృతంగా సంప్రదింపులు జరిపినా పెద్దగా ఉపయోగం జరగలేదు. టిడిపి సర్కారు 2015 ప్రాంతంలో సిఒసిలు ప్రవేశపెట్టినప్పుడూ బ్యాంకుల నిరాదరణ కొనసాగింది. 2019లో వైసిపి సర్కారు తెచ్చిన సిసిఆర్‌సి చట్టమూ అంతే. కౌలు రైతులకు బ్యాంక్ పరపతే ప్రధాన సమస్య. అలాంటప్పుడు కూటమి ప్రభుత్వం తెస్తామంటున్న కొత్త చట్టంపై బ్యాంకర్లతో చర్చించారా లేదా అన్న ప్రశ్న తలెత్తింది. గురువారం జరిగిన బ్యాంకర్ల భేటీలో కొత్త చట్టంపై చర్చ జరగకపోవడంతో సందేహాలు ఇంకా పెరుగుతున్నాయి.



ప్రతిష్టాత్మకంగా డ్రోన్ సమ్మిట్

- రాష్ట్ర మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
ఈ నెల 22, 23 తేదీల్లో అమరావతిలో నేషనల్ డ్రోన్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన డ్రోన్ సమ్మిట్‌పై ఢిల్లీలో మాట్లాడుతూ.. సికె కన్వెన్షన్‌లో జరిగే ఈ సమ్మిట్‌ను 22వ తేదీన ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం విజయవాడలోని పున్నమి ఘాట్ వద్ద ఐదు వేల కంటే ఎక్కువ డ్రోన్‌లతో భారీ డ్రోన్ షో నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరగనుందన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ఉన్నవారిని, స్టార్టప్ కంపెనీలను, ఇంజినీరింగ్ కాలేజీలు, ఐఐటిలు, ఎన్ఐటిలు అందరిని ఆహ్వానించామని తెలిపారు. డ్రోన్ తయారీ, టెస్టింగ్, డ్రోన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ పెద్దయెత్తున పెట్టుబడులను ఆహ్వానించామన్నారు. ఆయనతోపాటు డ్రోన్ కార్పొరేషన్ ఛైర్మన్ దినేష్ కుమార్, పౌర విమానయానశాఖ ఆర్థిక సలహాదారు పియూష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

అన్విత బిల్డర్స్‌పై ఐటి దాడులు

- అర్ధరాత్రి వరకు కొనసాగిన సోదాలు
- గత ఐదేళ్ల పన్ను వ్యవహారాలపై ఆరా

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో
హైదరాబాద్‌లో ఒక ప్రముఖ గృహనిర్మాణ కంపెనీ అన్విత బిల్డర్స్ కార్యాలయాలు, యాజమానుల నివాసాలపై ఆదాయపు పన్ను శాఖ (ఐటి) అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు సోదాలు కొనసాగాయి. 40 మంది ఐటి అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. రాయదుర్గంలోని ఆరంతస్తుల భవనంలో ఉన్న కంపెనీ ప్రధాన కార్యాలయంలో సోదాలు ప్రారంభించిన అధికారులు కొంపల్లి, జూబ్లీహిల్స్‌లోని కార్యాలయాల తోపాటు ఆ కంపెనీ ఎండి బి అచ్యుతరావు ఆయన కుమారుడు అనూప్, కంపెనీ భాగస్వామి శ్రీనివాసరావు నివాసాల్లోనూ సోదాలు నిర్వహించారు. గత ఐదేళ్లకు సంబంధించిన కంపెనీ వ్యాపార లావాదేవీలతోపాటు పన్నుల చెల్లింపులో అక్రమాలపై అధికారులు క్షుణ్ణంగా ఆరా తీసినట్లు తెలిసింది. కంపెనీ ఆదాయ వ్యయాలకు సంబంధించిన పుస్తకాలతోపాటు కంప్యూటర్ల హార్డ్ డిస్క్‌లను ఐటి అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. అంతేకాకుండా సింగపూర్, దుబాయ్‌లో అన్విత బిల్డర్స్ నిర్వహించే ఇంటీరియర్ డెకరేషన్‌కు సంబంధించిన కోట్ల రూపాయల వ్యాపార లావాదేవీలపై కూడా ఐటి అధికారులు ఆరా తీశారు. కంపెనీ యాజమాన్యం మనీలాండరింగ్‌కు పాల్పడిందా..? అనే కోణంలో కూడా ఐటి అధికారులు దృష్టి సారించినట్టు తెలిసింది.

హమాస్ చీఫ్ సిన్వార్‌ను చంపేశాం

- ఇజ్రాయిల్ ప్రకటన
- ఇంకా ధ్రువీకరించని హమాస్

గాజా : పాలస్తీనా పౌరులపై అమానవీయ దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయిల్ గురువారం కీలక ప్రకటన చేసింది. గాజాలో హమాస్‌కు అధినేతగా వ్యవహరిస్తున్న యహ్యా సిన్వార్ తమ రక్షణ బలగాలు జరిపిన దాడుల్లో మరణించాడని, డిఎన్ఎ ఆధారంగా అతను చనిపోయినట్లు నిర్ధారణకు వచ్చామని ఇజ్రాయిల్ విదేశాంగ శాఖ మంత్రి తెలిపారు. అయితే, ఆయన మరణించారన్న విషయాన్ని హమాస్ ఇంకా ధ్రువీకరించలేదు. పాలస్తీనా భూభాగంలోకి చొరబాట్లు, గాజా స్ట్రిప్‌లో పౌరుల హత్యలకు ప్రతిచర్యగా గతేడాది అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఆ దాడిని సాకుగా చూపి ఆనాటి నుంచి అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ బలగాలు గాజాలో అమానీయ దాడులను కొనసాగిస్తోంది. ఈ దాడుల్లో దాదాపు 50 వేల మంది దాకా పౌరులు చనిపోయిన సంగతి తెలిసిందే. హమాస్ రాజకీయ చీఫ్ హనియే, హిజ్బుల్లా చీఫ్ నస్రుల్లాను టార్గెట్‌గా పెట్టుకుని హత్య చేసినట్టే ఇప్పుడు హమాస్ చీఫ్‌ను కూడా ఇజ్రాయిల్ హత్య చేసింది.
ఈ హత్యల పట్ల అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు మౌనం వహించాయి. గతేడాది అక్టోబరు 7నాటి దాడికి సిన్వార్ సూత్రధారి అని ఇజ్రాయిల్ ఆరోపించింది. అప్పటి నుంచి అతని కోసం వేటాడుతోంది.

పారిశ్రామిక అభివృద్ధిలో కొత్త అధ్యాయం

- సిఎంకు ఎపి ఛాంబర్స్ ప్రత్యేక అభినందనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ప్రభుత్వం ఆమోదించిన ఆరు కొత్త పాలసీలతో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధితె కొత్త అధ్యాయం ప్రారంభమైందనిఎపి ఛాంబర్స్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పొట్లూరి భాస్కరరావు, బి.రాజశేఖర్ తెలిపారు గురువారం విజయవాడలోని ఛాంబర్స్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో వేర్వేరు రంగాల్లో తీసుకొచ్చిన ఆరు పాలసీలు ఇప్పటి వరకూ వచ్చిన పాలసీలకంటే అత్యంత మెరుగైనవని పేర్కొన్నారు. వీటివల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెరుగుతాయని, ఆర్థికాభివృద్ధికి ఊతంగా ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విధానాలను తీసుకొస్తామని ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబునాయుడు వీటిని తీసుకురావడంపట్ల వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంతోపాటు, ఫుడ్ ప్రాసెసింగ్, ఎనర్జీ వంటి సుమారు 20 రంగాలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వానికి ఛాంబర్ ఒక నివేదిక తయారు చేసి ప్రతిపాదనలు సమర్పించిందని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీల్లో 90 శాతం ఛాంబర్స్ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్నారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఇదొక శుభపరిణామమని వివరించారు. ముఖ్యంగా పీపుల్ పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్(పిపిపిపి) పద్ధతిలో తీసుకువస్తున్న ప్రైవేటు పారిశ్రామిక పార్కులు రాష్ట్రంలో తిరుగులేని అధ్యాయాన్ని సృష్టిస్తాయని ఆనందం వ్యక్తం చేశారు. పార్కుల ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని, ఇది పారిశ్రామిక వ్తేతలకు కొత్త ఉత్సాహాన్ని నింపుతుందనడంలో సందేహం లేదని వివరించారు. అలాగే పారిశ్రామికవేత్తలకు ముఖ్యంగా మహిళలకు ప్రకటించిన ఇన్సెంటివ్‌లు గతంలో ఎవరూ ప్రకటించలేదని, ఇవి పారిశ్రామికరంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తాయని అన్నారు. ఛాంబర్స్ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీలు ఉపాధి కల్పనలో కీలకంగా మారనున్నాయని తెలిపారు. 20 లక్షల మందికి ఐదు సంవత్సరాల్లో ఉపాధి కల్పించాలనే సంకల్పంతో తీసుకొచ్చిన కొత్త పాలసీలు రాష్ట్ర ప్రగతికి సూచికలని అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరుగుతోందని, దీని ప్రభావం ఎపిలోనూ ఉందని, అయితే నూతన పాలసీల వల్ల ఉపాధి పెరుగుతుందని చెప్పారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో యువత ఉద్యోగాల కోసం బయట దేశాలకు వెళుతున్నారని, ఇక నుండి ఉపాధి కల్పించే విధంగా రూపొందుతారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీ అని నిరూపించారని పేర్కొన్నారు. గతంలో ఆయన ఉమ్మడి ఎపి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తీసుకొచ్చిన ఐటి ఇప్పుడు దేశానికి ఆదర్శంగా మారిందని తెలిపారు. ఎంఎస్‌ఎంఇ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామచంద్రరావు మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పారిశ్రామిక కేంద్రాలు పెట్టాలని తీసుకున్న నిర్ణయం చిన్న, మధ్య, సూక్ష్మ తరహా పారిశ్రామికవేత్తలల్లో కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. అలాగే పరిశ్రమలు పెట్టేందుకు అసరమైన సలహాలు ఇచ్చేందుకు ప్రత్యేక కేంద్రాలు పెట్టాలనే నిర్నయం కూడా ఎంతో ఉపయుక్తమైం దని అన్నారు. ఎపి ఛాంబర్స్ ఎనర్జీ కమిటీ ఛైర్మన్ బి.ఫణి చంద్ర మాట్లాడుతూ ప్రస్తుత ఎనర్జీ పాలసీలో పెట్టుబడి దారులకు అనేక సానుకూల అంశాలు ఉన్నాయని తెలిపారు. సోలార్ ఎనర్జీకి 25 శాతం, గ్రీన్ హైడ్రోజన్‌కు 30 శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించడం అభినందనీయమని తెలిపారు. సోలార్ రూఫ్‌టాప్ కెపాసిటీని పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎపి ఛాంబర్స్ నాయకులు కాకాని తరుణ్, అఫిలియేటెడ్ కౌన్సిల్ వైస్‌ఛైర్‌పర్సన్ జి.రాధిక, బోర్డు సభ్యులు డి.అపర్ణ తదితరులు మాట్లాడారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

- పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ధరల స్థిరీకరణలో భాగంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అన్ని రైతు బజార్లు, సంస్థాగత రిటైల్ దుకాణాల్లో నాణ్యమైన సరుకులను వినియోగదారులకు అందించాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ మేరకు విజయవాడ పడమట రైతు బజారు, గురునానక్ కాలనీలోని ఉషోదయ సూపర్‌మార్కెట్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో భాగంగా అన్ని రైతు బజార్లలో వంటనూనెలు, కందిపప్పు, ఉల్లి, టమోటాలను అందుబాటులో ఉంచామన్నారు. రైతు బజార్లలో సరుకుల తూకంలో వ్యత్యాసంపై ఎస్టేట్ ఆఫీసరును మంత్రి నిలదీశారు. రైతు బజార్లలో బియ్యం, కందిపప్పు పంపిణీకి ఏర్పాటు చేసిన కౌంటర్ల నిర్వహణకు సమయపాలన పాటించకపోవడాన్ని గుర్తించి షాపుల నిర్వహకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. మార్కెట్ ధరలకంటే తక్కువకే నిత్యావసర సరుకులను ఆందజేస్తున్నామని చెప్పారు. పామాయిల్ లీటర్ రూ.110లకు , సన్ ఫ్లవర్ ఆయిల్ లీటర్ రూ.124లకు , కిలో కందిపప్పు రూ.67లకు వినియోగదారులకు అందుబాటులో ఉంచామన్నారు.

జమిలీని ఎదుర్కొందాం

మొదటిపేజి తరువాయి
అన్ని కమిటీలూ సోషల్ మీడియా వింగ్‌తో మమేకం కావాలని సూచించారు. ఎన్నికలముందు అబద్ధాలు చెప్పలేకపోయామని, టిడిపి వాళ్లు అబద్ధాలు చెప్పి గెలిచారని అన్నారు. మరలా అధికారంలోకి రావాలంటే విశ్వసనీయత ఉండాలని, అది వైసిపికి ఉందనే విషయాన్ని మర్చిపోకూడదని తెలిపారు. వైసిపి పాలనపై ప్రస్తుతం ప్రజల్లో చర్చ మొదలైందని పేర్కొన్నారు. టిడిపి కూటమి పాలనలో విద్యారంగం దెబ్బతిందని తెలిపారు. ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్నా రైతులకు పెట్టుబడిసాయం ఇవ్వలేదని అన్నారు. ఇసుక టెండర్లు పిలుస్తున్నారన్న విషయం కూడా చెప్పకుండా వారే వేసుకుని, వారే పాడుకున్నారని ఇంతకంటే అప్రజాస్వామికం ఇంకొటి ఉండదని అన్నారు. ఇష్టం వచ్చినట్లుగా మద్యం అమ్మేందుకు కొత్త పాలసీలు తీసుకొచ్చారని వివరించారు. ప్రతి నియోజకవర్గంలోనూ పది పేకాట క్లబ్బులు నడుపుతున్నారని తెలిపారు. అలాగే పనితీరు ఆధారంగా అన్ని కమిటీల్లోనూ ప్రమోషన్లు ఉంటాయని చెప్పారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - అచ్చంపేట (పల్నాడు జిల్లా)



అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కొండూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోండూరులోని శ్రీనివాస తండాకు చెందిన కేతావత్ వెంకటేశ్వర్లు నాయక్(44) తనకున్న రెండు ఎకరాల భూమితోపాటు మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకున్నారు. రెండు ఎకరాల్లో కంది, పత్తి పంటలు, మరో రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నారు. నీటి కోసం నాలుగు బోర్లు వేయించారు. బోర్లు, పంటల సాగు నిమిత్తం సుమారు రూ.12 లక్షల వరకు అప్పు చేశారు. అకాల వర్షాలకు పంట దెబ్బతినడంతో అప్పులు తీర్చడం కష్టమైంది. తీవ్ర మనస్తాపంతో పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానిక రైతులు గమనించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంకటేశ్వర్లు నాయక్‌కు భార్య అంజమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రిబ్బన్‌కట్ చేసి, కలర్ మిషన్‌ను ప్రారంభిస్తున్న గఫూర్, తదితరులు


ప్రజా పోరాటాల వేదిక ప్రజాశక్తి

- ప్రజలు మరింత ఆదరించాలి
- కర్నూలు ఎడిషన్ కలర్ మిషన్ ప్రారంభోత్సవంలో ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి
ప్రజా పోరాటాల వేదిక ప్రజాశక్తి అని, అలాంటి పత్రికను ప్రజలు మరింత ఆదరించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. ప్రజాశక్తి కర్నూలు ఎడిషన్ కేంద్రంలో కలర్ మిషన్ ప్రారంభోత్సవాన్ని గురువారం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య కలర్ మిషన్ స్విచ్‌ఆన్ చేశారు. అనంతరం ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహా అధ్యక్షతన నిర్వహించిన సభలో గఫూర్ మాట్లాడారు. ప్రజాశక్తి చదవడం వల్ల ప్రపంచానికి సంబంధించిన ప్రతి విషయంపై అవగాహన వస్తుందన్నారు. సమాజాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఏం చేయాలనేది ప్రజాశక్తి చెబుతుందన్నారు. ప్రజాశక్తి దినపత్రిక వ్యాపారం కోసం పెట్టుకున్న పత్రిక కాదని, ప్రజా సమస్యలను వెలికితీస్తూ ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలుస్తుందని తెలిపారు. ఈ పత్రికను ప్రజలు మరింత ఆదరించి, మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఎవరికీ భయపడాల్సిన పని లేదని, వాస్తవాలను వెలుగులోకి తేవాలని, తప్పులను ఎత్తి చూపాలని విలేకరులకు, సిబ్బందికి సూచించారు. ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్ మాట్లాడుతూ.. 1981లో మోటూరు హనుమంతరావు సంపాదకత్వంలో ప్రజాశక్తి దినపత్రికగా ప్రారంభమైందన్నారు. కరోనా సమయంలోనూ సిబ్బంది ప్రాణాలకు తెగించి పని చేశారన్నారు. అలాంటి క్లిష్ట సమయంలోనూ పత్రికను తీసుకొచ్చామని, పాఠకుల ఆదరణ మూలంగానే అది సాధ్యమైందని అన్నారు. కర్నూలు, విశాఖ, ఒంగోలులో కలర్ మిషన్లను తీసుకొస్తున్నామన్నారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ.. ఇతర పత్రికల విధానాలకు, ప్రజాశక్తి విధానాలకు తేడా ఉంటుందన్నారు. యువకులు, నిరుద్యోగులకు ఉద్యోగ, పోటీ పరీక్షలకు కావాల్సిన సమాచారం ప్రజాశక్తిలో దొరుకుతుందన్నారు. ప్రజాశక్తి డెస్క్ ఇంఛార్జి పి.చంద్రయ్య వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బతుకన్న, నంద్యాల టిడిపి నాయకులు కాతారమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలహాబాద్ హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అంబటి లక్ష్మణరావు మృతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, రెడ్ క్రాస్ సొసైటీ మాజీ రాష్ట్ర చైర్మన్ జస్టిస్ అంబటి లక్ష్మణరావు కన్నుమూశారు. ఆయన వయసు 91 సంవత్సరాలు. గురువారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లోని తన స్వగృహంలో ఆయన తుదిశ్వాస విడిచారు. విస్పర్ వేలీలోని వైకుంఠ మహాప్రస్తానంలో శుక్రవారం మధ్యాహ్నం 1 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.
గుంటూరు జిల్లా పొన్నూరు తాలూకా వెల్లలూరు గ్రామంలో ఆయన 1934 జనవరి 14న జన్మించిన ఆయన 1959లో అడ్వకేట్‌గా కెరీర్ ప్రారంభించారు. 1982లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన 1992 - 92 మధ్య ఐదు ప్రత్యేక సందర్భాల్లో యాక్టింగ్ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. 1995లో అలహాబాద్ హైకోర్టుకు బదిలీ అయిన ఆయన 1996లో పదవీ విరమణ చేశారు.
భారతదేశ న్యాయవ్యవస్థకు లక్ష్మణరావు చేసిన సేవలు అమూల్యమైనవని, నిజాయితీ, క్రమశిక్షణ, నైతిక విలువలు నేటి యువతకు ఎంతో ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. పొన్నూరు నియోజకవర్గం వెల్లలూరులో బెల్ట్ షాపుల నిర్మూలనకు, రైతుల సమస్యల పరిష్కారానికి, చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి చేశారు. జన చైతన్య వేదిక నిర్వహించిన ఎన్నికల నిఘా వేదికలలో, మద్య నియంత్రణ ఉద్యమంలోనూ జస్టిస్ అంబటి లక్ష్మణరావు కీలకపాత్ర పోషించారని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

జత్వానీ నుంచి స్వాధీనం చేసుకున్న పరికరాలను భద్రపరచండి

- గత ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి
సినీనటి కాదంబరి జత్వానీ నుంచి స్వాధీనం చేసుకున్న పరికరాలను భద్రపరిచేలా పోలీసులను ఆదేశించాలంటూ వ్యాపారవేత్త కె విద్యాసాగర్ వేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 22కు వాయిదా పడింది. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను భద్ర పరచాలన్న పిటిషనర్ వినతి మేరకు గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను గురువారం మరోసారి పొడిగిస్తూ జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి ఉత్తర్వులు జారీ చేశారు. సినీనటి కాదంబరి నరేంద్ర కుమార్ జత్వానీ, ఆమె తల్లి తనను బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేసి తన నుంచి భారీ మొత్తం వసూలు చేశారని విద్యాసాగర్ గత ఫిబ్రవరిలో ఇబ్రహీం పట్నం పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదిస్తూ.. ఈ కేసును సిఐడికి అప్పగించారని, హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ జత్వానీ ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఆమెకు దర్యాప్తు అధికారి ఇచ్చేశారని చెప్పారు. పోలీసుల తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదిస్తూ.. కౌంటర్ వేసేందుకు గడువు కావాలని కోరడంతో విచారణ ఈ నెల 22కు వాయిదా పడింది.

అందుబాటులోకి రూ.99కే మద్యం

- ఎక్సైజ్‌శాఖ డైరెక్టరు నిషాంత్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.99కే క్వార్టర్ బాటిల్ మద్యాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఎక్సైజ్‌శాఖ డైరెక్టరు నిషాంత్ కుమార్ తెలిపారు. మద్యం తయారీ, విక్రయాలలో జాతీయ స్థాయిలో పేరు, ప్రతిష్టలు ఉన్న 5 సంస్థలు రాష్ట్రంలో ఈ ధరకు మద్యం విక్రయాలు చేసేందుకు సిద్ధమైనట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే 10 వేల కేసుల మద్యం మార్కెట్‌కు చేరిందని, ఈ నెల 21వ తేదీ నాటికి మరో 20 వేల కేసుల మద్యం మార్కెట్‌కు చేరుతుందన్నారు. నెలాఖరు నాటికి 2.40 లక్షల కేసుల మద్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ క్రమంలో 1.20 కోట్ల క్వార్టర్ బాటిళ్ల మద్యం ఈ నెలలో వినియోగదారులకు అందుబాటులో ఉందన్నారు. ఈ నెలలో జరిగిన విక్రయాల ఆధారంగా నవంబరు నెలలో ఏ మేరకు స్టాక్ దిగుమతి చేసుకోవాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

తప్పిన'గండం'

మొదటిపేజి తరువాయి
కేంద్రానికి వెళ్లాలని బాధితులకు సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం చినమైనవానిలంక, పెదమైనవానిలంక గ్రామాల్లో వంద మీటర్లకుపైగా సముద్రం ముందుకొచ్చింది. మొగల్తూరు మండలం పేరుపాలెం, కెపి పాలెం బీచ్‌ల్లో సముద్రపు అలలు ఎగసిపడ్డాయి. సుమారు 50 మీటర్లమేర సముద్రపు నీరు ముందుకొచ్చింది. దీంతో బీచ్‌లోని దుకాణాల్లోకి సముద్రపు నీరు చేరింది.

22న అల్పపీడనం
ఈనెల 22న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండి ప్రకటించింది. ఈ ప్రభావంతో శుక్రవారం ఉత్తరాంధ్ర మినహా మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉత్తరాంధ్ర, కృష్ణా, గుంటూరు, బాపట్లలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శని, ఆది,సోమవారం కూడా ఆయా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తామని పేర్కొంది.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు (కృష్ణ జిల్లా)
రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం కవుతరంలో రూ.23 లక్షల వ్యయంతో ఆధునీకరించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని గురువారం ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కవుతరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌పి పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటిగా ఐదు ఫైళ్లపై సంతకాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డిఐజి రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ ఎంఎస్ గోపాలకష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి ఎఆర్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా)



పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం జరడ ఘాట్ రోడ్‌లో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఎఆర్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు అందించిన కథనం ప్రకారం.. కోట్ల బుల్లిబాబు (48) ఎఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో నివాసముంటున్న బుల్లిబాబు గురువారం హిరమండలం నుంచి ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌కు వస్తుండగా జరడ ఘాట్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో రాయికి తల ఢీకొనడంతో తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన స్వస్థలం పాలకొండ మండలం గొట్ట మంగళాపురం గ్రామం కాగా, హిరమండలంలో స్థిర నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



కడప డిఇఒ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు, మున్సిపల్ ఉపాధ్యాయులు

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

- ఉద్యోగోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలి
- డిఇఒ కార్యాలయాల వద్ద మున్సిపల్ ఉపాధ్యాయుల ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం
తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ ఉదాసీనతను నిరసిస్తూ డిఇఒ కార్యాలయాల వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఉపాధ్యాయులు గురువారం ఆందోళనలు చేశారు. పిఎఫ్, అప్‌గ్రేడేషన్, ఉద్యోగోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

కడప డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నానుద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ.. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో జాప్యం తగదన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు, ఉత్తర్వులు ఇదే విద్యా వ్యవస్థలో భాగంగా ఉన్న మున్సిపల్ టీచర్లకూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధకు వినతిపత్రం ఇచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఉపాధ్యాయులు చేపట్టిన ధర్నాకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బి.గోపీమూర్తి మద్దతు తెలిపి మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనేకసార్లు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిఒ 117 రద్దు చేసి ప్రమోషన్లు, బదిలీలు ఇవ్వాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌ఛార్జ్ డిఇఒకు అందజేశారు. ఏలూరులో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించారు. పోస్టును అప్‌గ్రేడ్ చేయాలని, ఉద్యోగోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని, జిపిఎఫ్ ఖాతాలు తెరిపించాలని ప్లకార్డులు పట్టుకుని నినదించారు. అనంతరం డిఇఒ వాసుదేవరావుకు వినతిపత్రం అందించారు. శ్రీకాకుళం నగరంలోని డిఇఒ కార్యాలయం వద్ద సత్యాగ్రహ దీక్షను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయులపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మున్సిపల్ హైస్కూల్‌ల్లో అవసరమైన మేరకు ఉపాధ్యాయులను నియమించేందుకు వీలుగా ఎస్‌జిటి, పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాల కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- ఎపిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని నరేంద్ర మోడీ కలిసి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో 50 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తే మిగిలిన వారి సంగతేమిటని ప్రశ్నించారు. కేంద్రం హామీ ఇచ్చిన 20 కోట్ల ఉద్యోగాలలో రాష్ట్రానికి ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తుందనే విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. చంద్రబాబు 2014లో చెప్పిన వాటికి, ఇప్పుడు చెబుతున్న వాటికి తేడా ఏమీ లేదని, పాత సినిమాకి కొత్త టైటిల్ పెట్టినట్లు ఉందన్నారు. ఒక్క ఉద్యోగమూ ఇవ్వని మోడీకి బాబు ఎందుకు మద్దతు ఇస్తున్నారో చెప్పాలన్నారు. కేంద్రం మరో 30 లక్షల ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 3 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కేంద్రం ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే పరిశ్రమల కోసం ఎక్కడికి పోవాల్సిన అవసరం లేదన్నారు. విశాఖ ఉక్కు ప్యాక్టరీకి ఒక క్యాపిటల్ మైన్ ఇస్తే ప్రధానికి పోయేదేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి అని అన్నారని, ఇంతవరకూ భృతి జాడ లేదన్నారు. తల్లికి వందనం, మహాలక్ష్మి, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలు పరిస్థితి ఏంటో చెప్పాలన్నారు. హర్యానా ఎన్నికలతో ఎపి ఎన్నికలను ఎలా పోలుస్తారని మాజీ సిఎం జగన్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. రాష్ట్రంలో ప్రజల నాడికి అనుకూలంగా ఫలితాలు ఉండగా, హర్యానాలో వ్యతిరేకంగా ఫలితాలు వచ్చాయని చెప్పారు. జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీదరించుకున్నారని, లిక్కర్ విషయంలో జగన్‌కు, బాబుకు పెద్ద తేడా లేదని చెప్పారు. జగన్ హయాంలో లిక్కర్ మాఫియా తాడేపల్లి ప్యాలెస్‌కు లింక్ అయ్యిందని, ఇప్పుడు నియోజకవర్గంలోని తమ్ముళ్ల చేతుల్లో ఉందని విమర్శించారు.

ప్రభుత్వ ఖాజీల సమస్యలు పరిష్కరిస్తాం

- మంత్రి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఖాజీలు

రాష్ట్రంలో ప్రభుత్వ ఖాజీల సమస్యలన్నింటినీ ప్రణాళికా బద్ధంగా పరిష్కరిస్తామని మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. సచివాలయంలో ప్రభుత్వ ఖాజీల ప్రతినిధులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన మైనార్టీల సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరించేందుకు ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఖాజీలందరూ నైతికతతో న్యాయంగా సేవలందించాలని, చట్ట పరిధిలో పనిచేసి మన్ననలు పొందాలని సూచించారు. ఖాజీల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఖాజీల ప్రతినిధులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరిస్తూ... ప్రస్తుతం ఒక ప్రభుత్వ ఖాజీ ఉన్నచోట మరొకరిని, లేదా అదనపు ఖాజీని నియమించకూడదన్నారు. గత ప్రభుత్వం ఖాజీల చట్టానికి విరుద్ధంగా నియోజకవర్గానికి ఒకరి కంటే ఎక్కువ సంఖ్యలో ఖాజీలను నియమించిందని చెప్పారు. ఉన్నవారికి కాలపరిమితిని తొలగించి క్రమబద్ధీకరించాలని కోరారు. ఎయిడెడ్, నాన్ ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో ఉర్దూను ద్వితీయ భాషగా పరిగణించాలన్నారు. ఖాజీల అవసరాలకు తగ్గట్టుగా మొబైల్ యాప్ రూపొందించాలని కోరారు. వక్ఫ్ బోర్డు నుంచి వివాహ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని, తమిళనాడు తరహాలో ప్రభుత్వ ఖాజీలకు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దుల్హన్ పథకం కింద ప్రయోజనం పొందేందుకు గత ప్రభుత్వం విధించిన అసమంజస నిబంధనల్లో మార్పులు చేయాలని కోరారు.

ఆస్పత్రుల నిర్వహణపై అవగాహన

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ప్రభుత్వాస్పత్రుల నిర్వహణ, సేవల నాణ్యతలో వచ్చిన మార్పుల్ని ప్రజలు గమనించినప్పుడే సార్థకత ఉంటుందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో తీసుకొచ్చిన మార్పులను అధికారులు తమ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలపాలని సూచించారు. రెండు నెలల క్రితం 30 అంశాలతో రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అమలుపై వైద్యాధికారులు, సూపరింటెండెంట్‌లతో సచివాలయంలో మంత్రి గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు సేవలందించేందుకు 725 మంది సహాయకులు, రూ.240 కోట్ల మేరకు పరికరాల అవసరాలు ఉన్నట్లు గుర్తించామన్నారు.
శుభ్రత, సైన్ బోర్డులు, ఒపి రిజిస్ట్రేషన్, రిసెప్షన్, ఫీడ్ బ్యాక్, హాజరు నియంత్రణ, కేంద్రీకృత నమూనాల సేకరణ వంటి అంశాల్లో మార్పులు తెచ్చామని జిజిహెచ్‌ల సూపరింటెండెంట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన సేవల్ని ఆశించే హక్కు ప్రజలకు ఉందని, వారి అంచనాల మేరకు పనిచేయడం, ప్రభుత్వ వైద్యసిబ్బంది బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, డిఎంఇ నరసింహం, 16 ప్రభుత్వాస్పత్రులు, విశాఖపట్నంలోని చెస్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్1, ఎన్ 3 జెట్టీ ప్రారంభం

- తూర్పు నౌకాదళ కమాండ్‌లో పర్యటించిన సిఎన్ఎస్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)
విశాఖపట్నం తూర్పు నౌకాదళ కమాండ్‌ను చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ (సిఎన్ఎస్) అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి, ఎన్‌డబ్ల్యుడబ్ల్యుఎ అధ్యక్షులు శశి త్రిపాఠి సందర్శించారు. తూర్పు నౌకాదళ కమాండ్‌లో నూతనంగా నిర్మించిన అత్యాధునిక ఎన్ 1, ఎన్ 3 జెట్టీని నౌకాదళాధిపతి ప్రారంభించారు. ఈ జెట్టీ అన్ని ఆధునిక సపోర్ట్ ఫీచర్లతో, తూర్పు నౌకాదళ కమాండ్ సముద్ర మౌలిక సదుపాయాలను పెంచుతుందని, సమీప భవిష్యత్తులో పలు నౌకలకు అదనపు బెర్తింగ్ స్థలాన్ని అందిస్తుందని నేవీ అధికారులు తెలిపారు. ఈ సదుపాయం నౌకాదళం కార్యాచరణ సామర్థ్యాలను బలోపేతం చేయడమే కాకుండా జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడానికి, సముద్ర భద్రతను నిర్ధారించడానికి మిషన్‌గా పని చేస్తుందని పేర్కొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంత్యుత్సవం

- రాష్ట్రస్థాయి వేడుకల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



వాల్మీకి జయంత్యుత్సవాల్లో ప్రసంగిస్తున్న మంత్రి సవిత

వాల్మీకి జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలో వాల్మీకి రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాలను గురువారం నిర్వహించారు. ముందుగా నగరంలోని పవర్ ఆఫీస్ దగ్గర ఉన్న వాల్మీకి విగ్రహానికి రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్.రాజు, ఎంపిలు అంబికా లక్ష్మీనారాయణ, బికె.పార్థసారధి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, రాష్ట్ర బిసి.వెల్ఫేర్, సెక్రటరీ పోలా భాస్కర్, కలెక్టర్ తదితరులు పూలమాలలు వేశారు. అనంతరం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుత్తి రోడ్డులో మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న బల్లా కన్వెన్షన్ హాల్‌లో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. వాల్మీకి బోధనలు స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. వాల్మీకి రాసిన రామాయణం భారత దేశంతో పాటు ప్రపంచ దేశాలు అనుసరించదగ్గ మహాకావ్యమన్నారు. అన్నదమ్ములు ఎలా ఉండాలి, రాజ్యాన్ని ఏ విధంగా పరిపాలించాలి, ప్రజలతో ఏ విధంగా మమేకం కావాలన్న విషయాలు రామాయణ గ్రంథం తెలియజేస్తుందన్నారు. వాల్మీకుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తోందన్నారు.

చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ సేవలు విస్తరిస్తాం

- ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు నారాయణ

ప్రజాశక్తి-చల్లపల్లి (కృష్ణా జిల్లా)
చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ సేవలను మరింత విస్తరించి పేదలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు కె నారాయణ తెలిపారు. కృష్ణా జిల్లా చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించి అక్కడ జరుగుతున్న సేవా కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కొండాపూర్‌లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో సిఆర్ ఫౌండేషన్ నడుస్తుందని తెలిపారు. 85 గదులు, రెండు డార్మెటీరిలలో పేదవారికి ఆరోగ్య కేంద్రాలు, ఉపాధి శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం విడిపోయిన నేపథ్యంలో ఇదే తరహాలో ఆంధ్ర రాష్ట్రంలోనూ సిఆర్ ఫౌండేషన్ స్థాపించి ఇక్కడ కూడా సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో పుట్టిన చంద్ర రాజేశ్వరరావు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని, పేద ప్రజల పక్షాన నిలిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు అక్కినేని చంద్రరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, మహిళా సమైక్య జిల్లా నాయకులు మల్లు పెద్ది రత్నకుమారి, కంఠంనేని జ్యోత్న్స దేవి పాల్గొన్నారు.

ఎన్‌సిఇఆర్‌టికి మున్సిపల్ టీచర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ (ఎస్‌ఇఆర్‌టి)లో మున్సిపల్ ఉపాధ్యాయులకూ అవకాశం కల్పించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఎన్‌సిఇఆర్‌టిలో డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికి ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల మాత్రమే అర్హులని గతంలో ప్రకటించింది. అయితే, తమకు కూడా అవకాశం కల్పించాలని మున్సిపల్ ఉపాధ్యాయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఉపాధ్యాయులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చుని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటన గురువారం విడుదల చేశారు.

ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ 'దీపావళి షాపోత్సవ్'

బెంగళూరు : ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ డిజిటల్ బి2బి మార్కెట్‌ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ తన సభ్యుల కోసం అక్టోబర్ 9 నుండి నవంబర్ 1వ తేదీ మధ్య దీపావళి షాపోత్సవ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది.
ఇది మొత్తం 26 స్టోర్‌లు, ఆన్‌లైన్ ఛానెల్‌లలో అందుబాటులో ఉంటుందని పేర్కొంది. బంపర్ లక్కీ డ్రా ఆఫర్‌లు, ఎంపిక చేసిన బ్రాండ్‌లపై రివార్డ్‌లను గెలుచుకునే అవకాశం ఉంటుందని ఆ సంస్థ ప్రతినిధి దినకర్ అయిలవరపు తెలిపారు. దీంతో కిరాణా సభ్యులు, ఎస్ఎంఇలు, ఇతర వ్యాపార యజమానులకు సొమ్ము ఆదా కానుందన్నారు.

'మంచి ప్రభుత్వ' పోకడ ఇదేనా? : ఐద్వా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
'మంచి ప్రభుత్వం' పేరిట మద్యం దుకాణాలను ఏ నిబంధనలు లేకుండా అనుమతించడాన్ని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి తప్పుబట్టారు. గత రెండు రోజులుగా రాష్ట్రంలో అనేకచోట్ల నిబంధనలు పాటించకుండా, ముందస్తు ప్రకటనలు లేకుండా మద్యం షాపులు ఏర్పాటు చేయడాన్ని మహిళలు, వివిధ వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్నట్లు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో షాపులు ఎక్కడ పెట్టాలనే విషయం స్పష్టం చేసి లైసెన్సులు జారీ చేసేవారని, కూటమి ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరించడం ఎవరి సంక్షేమం కోసమని ప్రశ్నించారు. మద్దతుదారుల లాభాలు, ప్రభుత్వ ఆదాయం తప్ప మత్తు పదార్థాలు తాగడంతో మహిళలపై అత్యాచారాలు, ఇళ్లల్లో దాడులు, రకరకాల హింసలను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మంచి మద్యం మత్తును కలిగించదా, ఆ పేరుతో 800 షాపులను పెంచడం మద్యపానాన్ని ప్రోత్సహించడమే అవుతుందన్నారు. మద్యం షాపుల్లో వాటాలు అక్రమంగా పొందుతున్న ఎమ్మెల్యేలు విచ్చలవిడిగా అక్రమ అమ్మకాలను ప్రోత్సహించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రజల ఘోష ఆలకించి మద్య నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గుండ్లకమ్మలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి-మద్దిపాడు (ప్రకాశం జిల్లా)
ఈతకెళ్లి ఓ యువకుడు గుండ్లకమ్మ జలాశయంలో గల్లంతయ్యారు. ఈ సంఘటన ప్రకాశం జిల్లా మద్దిపాడులో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిపాడుకు చెందిన గంగిశెట్టి బ్రహ్మనాయుడు (31) తన స్నేహితులతో కలిసి రాచవారిపాలెం వద్ద గుండ్లకమ్మ జలాశయంలో ఈతకు వెళ్లారు. ప్రమాదవశాత్తు బ్రహ్మనాయుడు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులు, గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టారు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. బ్రహ్మనాయుడికి భార్య మౌనిక, కుమారుడు సిద్ధార్థ వర్మ ఉన్నారు. వర్షాల వల్ల నది ఉధృతంగా ప్రవహిస్తుందని, ప్రజలు ఎవరూ ఈత కోసం నదిలోకి దిగవద్దని అధికారులు సూచించారు.

మెటా ఉద్యోగులపై వేటు

న్యూయార్క్ : కరోనా సమయంలో టెక్నాలజీ రంగంలో ప్రారంభమైన ఉద్వాసనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇటీవల ఇంటెల్, సిస్కో, ఐబిఎం కంపెనీలు పెద్ద ఎత్తును సిబ్బందిని తొలగించాయి. ఈ ఏడాది ఆగస్టు నాటికి 422 కంపెనీలు ఏకంగా 1,36,000 మందిని తొలగించాయని అంచనా. మెటాలో ముఖ్యంగా నియామకాలు, లీగల్ ఆపరేషన్ పలు రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ఎక్కువగా ప్రభావం పడనుందని సమాచారం. ఇప్పటికే పలుసార్లు ఉద్యోగులను తొలిగించగా.. కరోనా నష్టాల బూచిని చూపి 2022లో ఏకంగా 11,000 మందిని రోడ్డున పడేసింది. ఇక గతేడాది రెండు విడతల్లోనూ సుమారు 10,000 మందిని తొలగించింది. తాజాగా మరోమారు ఉద్వాసనలకు సిద్ధం కావడంతో ఆ రంగం ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. కంపెనీ సామర్థ్యాన్ని మెరుగుపర్చడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాలు, ప్రాంతీయ వ్యూహాల్లో మార్పులు చేస్తున్నామని మెటా అధికారిక ప్రతినిధి తెలిపారు. అందులో భాగంగానే ఈ తొలగింపులు చేపడుతున్నట్లు వెల్లడించారు. మెటా నుంచి ఉద్వాసన పలికిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ అవకాశాలు అందించేందుకు కంపెనీ ప్రయత్నం చేస్తుందన్నారు.

సంపాదకీయం

నోబెల్ బహుమతులు


2024 సంవత్సరానికిగానూ ఆరు విభాగాల్లోనూ పురస్కారాలను ప్రకటించటం గత వారంలో పూర్తయింది. భౌతిక, రసాయన, వైద్య, ఆర్థిక శాస్త్రాల్లో గొప్ప ఆవిష్కరణలు, సిద్ధాంతీకరణ చేసిన శాస్త్రవేత్తలకు పురస్కారాలను ప్రకటించటంతో పాటు ఆయా రంగాల్లో వారు చేసిన కృషిని నోబెల్ పురస్కారాల కమిటీ ఘనంగా ప్రశంసించింది. సాహిత్యరంగంలో దక్షిణ కొరియా రచయిత్రి యాభై మూడేళ్ల హాన్ కాంగ్ ఈసారి నోబెల్ పురస్కారం పొందారు. ప్రపంచశాంతికి, నిరాయుధీకరణకు దాదాపు డెబ్బయ్ ఏళ్లుగా నిర్విరామ కృషి చేస్తున్న జపాన్‌కు చెందిన నిహాన్ హిడాంకియో సంస్థకు ఈ ఏడాది శాంతి బహుమతి లభించింది. ఈ అత్యున్నత పురస్కారాల ప్రధాన ఉద్దేశం కేవలం విజేతల పేరుప్రఖ్యాతులను చాటటం, పెద్దఎత్తున నగదు ప్రదానం చేయడం మాత్రమే కాదు; అంతకుమించి ప్రపంచ మానవాళిలో శాస్త్ర సాంకేతిక విజ్ఞాన ఆవిష్కరణల పట్ల అనురక్తిని కలిగించటం; ప్రపంచం మొత్తం సుఖసంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో విలసిల్లేలా ఆలోచనకు, ఆచరణకు పురిగొల్పడం కూడా!

మానవాళి వైజ్ఞానికంగా పురోగమించడం ద్వారానే సకల సమస్యల నుంచి, సంక్షోభాల నుంచి బయటపడడం సాధ్యమవుతుంది. భౌతిక, రసాయన, వైద్య విభాగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలు ప్రపంచాభివృద్ధికి చోదకశక్తిగా నిలిచాయి. అయితే, ఆయా ఆవిష్కరణల ఫలితాలను అచ్చంగా మానవాళి శ్రేయస్సుకు ఉపయోగించగలిగితేనే వాటికి సార్ధకత. లాభాల సృష్టికి, కార్పొరేట్ల అభివృద్ధికీ మళ్లిస్తే – ప్రపంచ ప్రజలకు ఇక్కట్లు మిగులుతాయి. అసమానతలు అంతకంతకూ పెరుగుతాయి. శాస్త్రం సత్యాన్ని ఆశ్రయించి సమాజ శ్రేయస్సును కోరితే, వ్యాపారం లాభాన్ని ఆశించి ప్రజలను నాజూకుగా దోచుకుంటుంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఒకనాటి సోవియట్ రష్యా చేసిన పరిశోధనలు, వైద్యరంగంలో నేడు క్యూబా చేస్తున్న సేవలూ ... సైన్సు ప్రజల కోసం, ప్రగతి కోసం అన్న విశాల దృక్పథానికి నిదర్శనం. అమెరికా వంటి అగ్రదేశాలు వైజ్ఞానిక ఆవిష్కరణల ఆసరాతో చేస్తున్న వాణిజ్యమంతా కార్పొరేట్ల సంపద సృష్టికి ఆనవాలు.

భవిష్యత్తులో అన్ని రంగాల్లోనూ కృత్రిమ మేధస్సు పాత్ర అంతకంతకూ ప్రాధాన్యాన్ని సంతరించుకోబోతున్నదని ఈ ఏడాది ఆవిష్కరణల గుర్తింపు చాటిచెప్పింది. భౌతిక, రసాయన శాస్త్రాలు రెంటిలోనూ ఎఐ ఆధారిత ఆవిష్కరణలకే పురస్కారం లభించింది. జన్యుశాస్త్రంలో మరింత సూక్ష్మమైన, నిర్దిష్టమైన విశ్లేషణకు వైద్యరంగానికి ఈ గుర్తింపు దక్కింది. ఈ ఆవిష్కరణతో రోగకారక జన్యువులను ముందే గుర్తించి, కచ్చితంగా ఛేదించటం; ఆరోగ్యకర జన్యుపటాన్ని నిర్మించటం వంటివి మున్ముందు సాధ్యం అవుతాయి. ఆర్థిక అసమానతలను సరిదిద్దటంపై చేసిన పరిశోధనకుగానూ ఆర్థిక శాస్త్రవేత్తలను ఆ పురస్కారం వరించింది. సంపద కొందరి వద్దే పోగు పడే నయా ఉదారవాద ఆర్థిక విధానాల డొల్లతనాన్ని ఈ పరిశోధన బయటపెట్టింది. దాదాపు 90 ఏళ్ల క్రితం అమెరికా అణుబాంబు దాడికి గురైన జపానులో శాంతి సామరస్యాల కోసం పాటు పడుతున్న హిడాంకియో సంస్థకు శాంతి బహుమతి రావటం సంతోషకరం. ఇజ్రాయెల్‌కు, ఉక్రెయిన్‌కు పరోక్ష, ప్రత్యక్ష మద్దతునిస్తూ యుద్ధాన్ని ఎగదోస్తున్న అమెరికా వంటి దేశాల దుశ్చర్యలపైనా, ద్వంద్వవైఖరుల మీదా ఈ సందర్భంగానైనా చర్చ జరగాలి.

నూటా ఇరవై మూడేళ్ల నుంచి నోబెల్ బహుమతులు ప్రదానం చేస్తుంటే– ఇంతవరకూ మనదేశానికి దక్కిన పురస్కారాలు కేవలం ఎనిమిది. అవి కూడా పూర్తిగా మనదేశంలోనే చేసిన కృషికి కాదు... భారత మూలాలు కలిగి, ఇతర దేశాల్లో స్థిరపడ్డ శాస్త్రవేత్తలూ, సాహిత్యవేత్తా పొందినవి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మన వెనుకబాటుకు ఈ సంఖ్య ఒక వెక్కిరింతగా భావించాలి. పురాతన భావాల్లోకి, మతోన్మాద చిచ్చుల్లోకి మళ్లిస్తున్న బిజెపి పాలనలో వైజ్ఞానిక రంగానికి ప్రోత్సాహం పూర్తిగా కొరవడుతోంది. ఆధునిక భావాలతో, శాస్త్ర విజ్ఞాన చింతనతో రేపటి పౌరులు వికసించేలా చేయడం పాలకుల కర్తవ్యం. ఆ పనిని ఎంతో వేగంగా, ఎంతో బలంగా, ఎంతో చిత్తశుద్ధి తో చేసినప్పుడు మాత్రమే విశ్వ వేదికలపై మన దేశానికి గుర్తింపూ, గౌరవమూ లభిస్తాయి.

మహనీయుల మాట




సమాజం మతం మత్తులో పడకుండా వుండాలంటే, మూఢనమ్మకాలు తొలగిపోవాలంటే విద్యా విధానంలో మార్పు రావాలి.

- థామస్ అల్వా ఎడిసన్,
ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.

Thomas A Edison

పశ్చిమాసియాను యుద్ధంలోకి లాగుతున్న ఇజ్రాయిల్

వ్యాఖ్య



ప్రబీర్ పురకాయస్థ



> **హమాస్ రాజకీయ విభాగపు అధినేత ఇస్మాయిల్ హనియే హత్యతో, గాజాలో జరుగుతున్న యుద్ధం, ఇరాన్‌కు లెబనాన్‌కూ విస్తరించింది. హనియే ఖతార్‌లో ఉండేవాడు. కానీ ఇరాన్ కొత్త అధ్యక్షుడి ప్రమాణ స్వీకార ఉత్సవంలో పాల్గొనడానికి, టెహ్రాన్ వచ్చి హత్యకు గురయ్యాడు. దానికి ప్రతిగా ఇజ్రాయిల్‌పై పరిమిత మిస్సైల్ దాడి చేసినా, ఇరాన్ ఆ సమాచారం అమెరికాకు, దాని మిత్ర దేశాలకు ముందే ఇచ్చింది. అయితే, నస్రుల్లా హత్యకు ప్రతీకారంగా ఇరాన్ జరిపిన దాడి చాలా తీవ్రమైనది. మూడు స్థాయిలలో ఉన్న ఇజ్రాయిల్ రక్షణ ఛత్రాన్ని (మిస్సైల్ దాడిని తట్టుకోగలిగిన ఛత్రం) అది ఛేదించగలిగింది. 'మిలిటరీ వాచ్' పత్రిక కథనం ప్రకారం, ఇజ్రాయిల్ విమాన స్థావరాలలో ఉండే వాయుసేనకు (ఎఫ్ 35, ఎఫ్ 15) తీవ్రమైన నష్టమే జరిగింది. టెల్ అవీవ్‌లో ఉండే ఇజ్రాయిల్ వేగు సంస్థ మొసాద్ కేంద్ర కార్యాలయం నేల మట్టమైందని కూడా ఆ వెబ్‌సైట్ ప్రకటించింది. ఈ కథనం వాస్తవమైతే, ఇజ్రాయిల్ గొప్పలు చెప్పుకొనే మూడంచెల రక్షణ వ్యవస్థ డొల్లతనం వెల్లడవుతున్నది.**

ఇజ్రాయిల్ ఘర్షణను పెంచుతూ పోయి, పశ్చిమాసియాను ఒక విస్తృత యుద్ధంలోకి లాగుతోంది. ఇజ్రాయిల్ ఒక సంవత్సర కాలంగా, గాజాలో మానవ హననాన్ని సాగిస్తోంది. లెబనాన్ లోకి ఇజ్రాయిల్ ప్రవేశించిన తరువాత, ఇరాన్‌పై మిస్సైల్ దాడికి తెగబడింది. తరువాత ఈ యుద్ధం ఇంకేమాత్రమూ గాజాకు పరిమితమై లేదు. ఇరాన్ అణు స్థావరాలపై దాడి చేస్తామని ఇజ్రాయిల్ బెదిరిస్తున్నదంటే, అమెరికా ఇస్తున్న పూర్తి మద్దతుతోనే. ఇప్పుడీ యుద్ధం ఒక నూతన దశలోకి ప్రవేశించింది. యెమెన్, సిరియా, ఇరాక్‌లు ఈ విస్తృతమైన యుద్ధంలోకి లాగబడ్డాయి. దీని ప్రభావం, ఆ ప్రాంతాన్ని దాటి ప్రపంచమంతటా పడుతోంది. అమెరికా, ఇజ్రాయిల్ జంటగా యుద్ధాన్ని పెంచుతూ తగ్గిస్తూ, చెలగాటమాడుతున్నాయి.

కానీ ఒక విషయం మరచిపోకూడదు. మొదటి ప్రపంచ యుద్ధం రావాలని, ఆనాడు ఏ పెద్ద దేశమూ అనుకోలేదు. తాము ఒక మెట్టు ఎక్కి బెదిరిస్తే, మిగిలిన వాళ్ళు ఒక మెట్టు దిగుతారని అనుకున్నారు. అమెరికన్ తాత్వికుడు జార్జ్ శాంతాయన చెప్పినట్టు 'గతాన్ని మరిచిపోయిన వాళ్ళు, మళ్లీ ఆ గతాన్ని పునరావృతం కానిస్తారు.' అయితే ఈసారి మాత్రం ఏ యుద్ధమైనా అణ్వాయుధాలతోనే ముగుస్తుంది. ఇరాన్‌లో ఉన్న న్యూక్లియర్ వ్యవస్థలను, ఇజ్రాయిల్ నాశనం చేయటానికి అమెరికా సహకరిస్తే, ప్రపంచ యుద్ధం ప్రారంభమైనట్టు అనుకోవాల్సి వస్తుంది. రష్యా, చైనాలు పశ్చిమాసియాలో మరో నయా వలసను అంగీకరించడం కష్టం కాబట్టి, ఈ పరిస్థితి తప్పదు.

అమెరికా వ్యూహాలు

ఇజ్రాయిల్ దాడి గాజాలోని, పౌర సదుపాయ వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేసింది. 42,000 మందిని చంపింది. భవనాలను కూల్చింది. 19 లక్షల ప్రజలను–అంటే పది మందిలో తొమ్మిది మందిని–నిర్వాసితులను చేసింది. పాలస్తీనా గతకాలపు విధ్వంసం (నక్బా) సందర్భంగా, శరణార్థులుగా వచ్చిన వాళ్లే గాజాలో ఎక్కువ. గాజా ప్రజలపై ఆ యుద్ధం కొనసాగుతూనే ఉంది. అయితే ఆ యుద్ధం లెబనాన్ లోకి ప్రవేశించిన తర్వాత, ఇరాన్ లాగబడ్డ తర్వాత, గాజాపై దృష్టి కొంచెం తగ్గింది.

యుద్ధం ఒక విస్తృత దృశ్యం. దాన్ని అర్థం చేసుకునే ముందు, కొన్ని అంశాలను మనం గుర్తుపెట్టుకోవాలి. సిరియాలో ఉండే ఇరాన్ ఎంబసీపై బాంబులు వేసి, ముఖ్యులైన మిలటరీ, దౌత్య ప్రముఖులను చంపింది. సిరియాపై దాడి చేసిందీ ఇజ్రాయిలే. ఓస్లో ఒప్పందం పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా వాగ్దానం చేస్తే, దాన్ని తుంగలో తొక్కి, అత్యధిక భాగాన్ని ఆక్రమించిందీ ఇజ్రాయిలే.

అయితే గాజా యుద్ధాన్ని, ఇజ్రాయిల్ ఎందుకని లెబనాన్ లోకి విస్తరించింది? పేజర్, వాకీటాకీ పేలుళ్లు, హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రుల్లా హత్య, లెబనాన్ దురాక్రమణ– ఇవేవీ తెలివైన సైనిక చర్యలుగా అనిపించవు. గాజా అనే చిన్న ముక్కలో ఉన్న, హమాస్‌ను మట్టుబెట్టాలనే సైనిక లక్ష్యాన్ని కూడా, ఒక సంవత్సరం అయినా, ఇజ్రాయిల్ సాధించలేకపోయింది. అమెరికా, నాటోలకున్న వ్యూహాత్మక లక్ష్యాలతో, ఇజ్రాయిల్‌కు వున్న మరో రెండు లక్ష్యాలను అనుసంధానించి చూస్తే తప్ప, ఇజ్రాయిల్ చర్యలు అర్థం కావు.

పశ్చిమాసియాపై అమెరికా నియంత్రణ బలహీనపడటం (పాశ్చాత్య దేశాలు, అట్లాంటిక్ దేశాలు దీన్నే మధ్య ప్రాచ్యం అంటారు), ఇరాన్ బలపడటం, ఇరాక్ దురాక్రమణ తర్వాత అక్కడి ప్రజల నుండి దూరం కావడం, సిరియా పాలకుల్ని తొలగించ లేకపోవడం–ఇవన్నీ అమెరికా దృష్టిలో వైఫల్యాలు. అవసరమైతే సైన్యాన్ని ఉపయోగించి అయినా, పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా ప్రయోజనాలను కాపాడాలనే కార్టర్ సిద్ధాంతానికి ముప్పు ఏర్పడినట్లు అమెరికా భావిస్తున్నది. గల్ఫ్ చమురును అమెరికా తన సొంత చమురు నిల్వల వ్యూహాత్మక పొడిగింపుగా భావిస్తున్నట్టు కనిపిస్తున్నది. అలాగే ఇజ్రాయిల్‌ను కూడా, తమకు మిలిటరీ పొడిగింపుగా అమెరికా, నాటో, పాశ్చాత్య దేశాలు భావిస్తున్నాయి. అందుకే ఇజ్రాయిల్‌కు ఈ దేశాలన్నీ సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నాయి. ఇరాన్‌తో శత్రుత్వం కొనసాగుతూ వస్తుందన్నా, ఇరాక్, సిరియా, లిబియా దేశాల ప్రభుత్వాలను కూల్చాలనే ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నా దానికి కారణం ఇవే.

హమాస్ రాజకీయ విభాగపు అధినేత ఇస్మాయిల్ హనియే హత్యతో, గాజాలో జరుగుతున్న యుద్ధం, ఇరాన్‌కు లెబనాన్‌కూ విస్తరించింది. హనియే ఖతార్‌లో ఉండేవాడు. కానీ ఇరాన్ కొత్త అధ్యక్షుడి ప్రమాణ స్వీకార ఉత్సవంలో పాల్గొనడానికి, టెహ్రాన్ వచ్చి హత్యకు గురయ్యాడు. దానికి ప్రతిగా ఇజ్రాయిల్‌పై పరిమిత మిస్సైల్ దాడి చేసినా, ఇరాన్ ఆ సమాచారం అమెరికాకు, దాని మిత్రదేశాలకు ముందే ఇచ్చింది. అయితే, నస్రుల్లా హత్యకు ప్రతీకారంగా ఇరాన్ జరిపిన దాడి చాలా తీవ్రమైనది. మూడు స్థాయిలలో ఉన్న ఇజ్రాయిల్ రక్షణ ఛత్రాన్ని (మిస్సైల్ దాడిని తట్టుకోగలిగిన ఛత్రం) అది ఛేదించగలిగింది. 'మిలిటరీ వాచ్' పత్రిక కథనం ప్రకారం, ఇజ్రాయిల్ విమాన స్థావరాలలో ఉండే వాయుసేనకు (ఎఫ్ 35, ఎఫ్ 15) తీవ్రమైన నష్టమే జరిగింది. టెల్‌అవీవ్‌లో ఉండే ఇజ్రాయిల్ వేగు సంస్థ మొసాద్ కేంద్ర కార్యాలయం నేల మట్టమైందని కూడా ఆ వెబ్‌సైట్ ప్రకటించింది. ఈ కథనం వాస్తవమైతే, ఇజ్రాయిల్ గొప్పలు చెప్పుకొనే మూడంచెల రక్షణ వ్యవస్థ డొల్లతనం వెల్లడవుతున్నది.

ఇజ్రాయిల్ టెర్రరిజం

ప్రపంచమంతా ఒక పద్ధతి ప్రకారమే నడవాలని ప్రకటించుకునే, ఈ పాశ్చాత్య దేశాల, నాయకులు–ముఖ్యంగా మాజీ వలసాధిపత్య దేశాలు–ఇరాన్ అంతర్జాతీయ సూత్రాలను ఉల్లంఘించిందని, దాని పర్యవసానాలు తప్పవని రంకెలు వేస్తున్నాయి. ఇజ్రాయిల్ నస్రుల్లాను హత్య చేసినప్పుడు, పేజర్లు వాకీటాకీలు పేల్చి హిజ్బుల్లా సభ్యుల, పౌరుల ప్రాణాలు తీసినప్పుడు, ఆమోద ప్రాయంగా వీరే తలలాడించారు. అటువంటి రహస్య పేలుడు పనిముట్లను వాడటాన్ని అంతర్జాతీయ చట్టాలు నిషేధించాయి. లెబనాన్‌లో జరిగిన ఈ పేలుళ్లను, ఒక విధమైన టెర్రరిజం అని ఒక మాజీ సిఐఏ డైరెక్టర్ లియో పానట్టా అన్నాడు. సప్లై చెయిన్ల ద్వారా ఉగ్రవాద చర్యలు జరిగితే, ఇక తర్వాత తరువాత ఏం జరుగుతుందో? అని ప్రజలు భయభ్రాంతులవుతారని ఆయన అన్నాడు. హ్యూమన్ రైట్స్ వాచ్ డైరెక్టర్ (మధ్య ప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా) లామాఫఖీ వ్యాఖ్యానిస్తూ" మానవ హక్కుల చట్టాలు, సంప్రదాయాలూ బూబీ ట్రాప్స్ వాడకాన్ని నిషేధిస్తున్నాయి. ఎందుకంటే, లెబనాన్‌లో లాగా, అవి అమాయకులైన పౌరుల ప్రాణాలకు ముప్పు తెస్తాయి కాబట్టి" అన్నాడు. బీరుట్‌లో బహుళ అంతస్తుల భవనాన్ని, అమెరికాలో తయారైన బాంబులు, ఎయిర్ క్రాఫ్ట్‌ల సహాయంతో కూల్చి, నస్రుల్లాను, ఇతర పౌరులను చంపారు.

నస్రుల్లా ఎన్నికలలో పాల్గొంటున్న ఒక రాజకీయ పక్ష నాయకుడని, వైద్యశాలలు, విద్యాలయాలు లాంటి సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడని తెలిసిందే. కానీ దీనిపై అమెరికా నోరు విప్పడం లేదు. అమెరికాలో తయారైన ఎఫ్ 15 విమానాలు మోసుకొచ్చిన 2 వేల పౌండ్ల బాంబులు, 80 వేల కేజీల పేలుడు పదార్థాలతో భూగర్భ బంకర్లను, భవనాలను పేల్చివేశారు.

స్వేచ్ఛా ప్రపంచపు నాయకుడిగా చెప్పుకునే అమెరికా దీనికి ఏ విధంగా ప్రతిస్పందించింది? ఇజ్రాయిల్‌ను అభినందించడం ద్వారా. ఇక అమెరికన్ మీడియా, అధికార ప్రతినిధులూ ఒకవైపు అమెరికా అధ్యక్షుడి ఆమోద ప్రకటనలతో, తమ ఆమోదాన్ని కలిపి ప్రసారం చేస్తున్నారు. కానీ, మరొకవైపు పశ్చిమాసియాలో యుద్ధాన్ని ఏ విధంగా విస్తరించాలనే పథకంలో ఉన్నారు.

చరిత్రను ఒకసారి గుర్తు చేసుకుందాం. 1982లో ఇజ్రాయిల్ దక్షిణ లెబనాన్‌ను ఆక్రమించింది. దాని పర్యవసానంగానే నస్రుల్లా ఒక నాయకుడిగా ఎదిగాడు. ఇజ్రాయిల్ మితవాద మలీషియాలతో చేతులు కలిపి, లెబనాన్ లోని సబ్రా షాటిల్లా శరణార్థి శిబిరాలపై దాడి చేసింది. రెండు మూడు వేలమంది పిల్లలను, మహిళలను చంపివేసింది. ఇజ్రాయిల్‌తో శాంతి ఒప్పందం తరువాతే ఇదంతా జరిగింది. ఈ దురాక్రమణను, మారణకాండను ఎదుర్కొనడానికి, అక్కడి అమన్ పార్టీతో కమ్యూనిస్టు పార్టీ జత కలిపింది. ఇరువురూ కలిసి 2000 సంవత్సరంలో ఇజ్రాయిల్‌ను తరిమి వేశారు. హిజ్బుల్లా కానీ, నస్రుల్లా కానీ ఈ సాయుధ పోరాటంలోనే ఆవిర్భవించారు. 2006లో ఇజ్రాయిల్ మళ్లీ దక్షిణ లెబనాన్‌పై దాడి చేసి, హిజ్బుల్లాను వెనక్కు కొట్టాలని ప్రయత్నం చేస్తే, హిజ్బుల్లా ప్రతిఘటించింది. లిటాని నది దాకా ఉన్న ప్రాంతాన్నంతటినీ ఖాళీ చేయించాలని ఇజ్రాయిల్ ప్రయత్నం. గాజాలో యుద్ధ విరమణ చేస్తే, ఖాళీ చేస్తానని హిజ్బుల్లా చెప్పిన విషయాన్ని పాశ్చాత్య మీడియా చెప్పకుండా దాస్తున్నది. బైడెన్ వత్తాసు చూసే, ఇజ్రాయిల్ యుద్ధానికి తెగబడింది. దానికి తగినట్టుగానే, బైడెన్ గానీ, బ్లింకెన్ గాని ఇజ్రాయిల్ తరఫున వకాల్తా పుచ్చుకుంటున్నారు.

ఒంటరి అవుతున్న భారతదేశం

యుద్ధాన్ని పెంచుతూ పోయి, ఇరాన్ లోని న్యూక్లియర్ స్థావరాలపై భౌతిక దాడులు చేయడానికి ఇజ్రాయిల్ సిద్ధపడుతోంది. దీనికి ప్రతిగా టెల్‌అవీవ్ దగ్గర ఉన్న అమ్మోనియా ఫ్యాక్టరీ పైన, డిమోనా న్యూక్లియర్ ప్లాంట్ పైన ఇరాన్ ప్రతి చర్యలు తప్పనిసరి అవుతాయి. వీటన్నింటి వల్లా, ఇజ్రాయిల్‌తో పాటు, అక్కడి పౌర జనాభాకు కూడా తీవ్రమైన నష్టం జరుగుతుంది. ఇంత జరుగుతున్నా, మెజారిటీ దేశాలు ఖండిస్తున్నా, మన దేశం మాత్రం, ఐక్యరాజ్యసమితిలో ఏ అభిప్రాయం చెప్పకుండా వెనక్కు తగ్గడం ఆందోళనకరం. మన దేశ అలీన విధానంలో వలస వ్యతిరేకత, ఆఫ్రికా ఆసియా దేశాలకు సంఘీభావంగా ఉండటం కీలకమైనది. ఈరోజు, ఆఫ్రికా, పశ్చిమాసియాలలో వలస విధానం చివరి అంకానికి చేరడం, ఒక కీలక పరిణామం. కానీ భారతదేశం ప్రభావశీలమైన ఈ ప్రపంచ పరిణామానికి దూరమై ఒంటరి అవుతున్నది. నాటో దేశాలు సైతం, పాలస్తీనా మరణహోమంపై ఇజ్రాయిల్‌ను బహిరంగంగా వ్యతిరేకిస్తున్నాయంటే, దానికి కారణం ఈ పరిణామమే.


(స్వేచ్ఛానువాదం)

పట్టణ సంపన్నులకు పర్యావరణ సందేశం

వ్యాఖ్య



రోహిత్ కుమార్



అక్షత్ సోగాని

మన దేశంలో ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టాయి. దేశవ్యాప్తంగా 'రెడ్ అలర్ట్' ప్రకటించారు. అధికారిక లెక్కల ప్రకారం వడగాడ్పులకు 200 మంది ప్రాణాలు కోల్పోయారు. కానీ లెక్కల్లోకి రాని మరణాలు చాలా ఎక్కువే. దేశ రాజధాని ఢిల్లీ నగరం మునుపెన్నడూ లేనంతగా 50 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతలు చవిచూసింది. రుతుపవనాల రాకతో దేశ ప్రజానీకం అనుభవించిన భారీ వేసవి ఉష్ణోగ్రతలు గత జ్ఞాపకాల్లోకి జారిపోయిందంటే మనం ఒక తీవ్రమైన ప్రమాదకర హెచ్చరికను నిర్లక్ష్యం చేస్తున్నట్లుగా భావించాలి.

గత దశాబ్ద కాలంగా దేశంలోని పట్టణ ప్రాంతాలన్నీ తీవ్రమైన వడగాడ్పులను చవిచూస్తున్నాయి. దీనినే మనం పట్టణ ద్వీపకల్ప ఉష్ణోగ్రత ప్రభావంగా పిలుచుకుంటాం. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ, నగర ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు సాపేక్షంగా ఎక్కువగా ఉంటాయి. దీనికి కారణం మానవ కార్యకలాపాల మూలంగా కర్బన ఉద్గారాలు పెరుగుతూ ఉండడమే. పట్టణ, నగర ప్రాంతాల్లోని నిర్మాణాల్లో కాంక్రీటు, గ్లాసు, తారు రేకుల వాడకం ఎక్కువగా వుండడం మూలాన ఇవి వేడిమిని ఎక్కువగా పట్టి ఉంచుతాయి. కార్పొరేట్ కంపెనీల సముదాయం ఎక్కువగా ఉన్న గురుగావ్ వంటి ప్రాంతాల్లో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. ఆధునికంగా, ఆకర్షణీయంగా కనబడడానికి కార్పొరేట్ ఆఫీసుల నిర్మాణాలన్నీ ఎక్కువగా గ్లాస్‌ను ఉపయోగించడం మూలంగా ఇవి ఎక్కువ వేడిమిని స్వీకరించడమే కాకుండా, పరిసర ప్రాంతాలకూ ఆ వేడిమిని ప్రసారం చేస్తాయి. ఈ వేడిమిని అదుపు చేసే హరిత ప్రదేశాలు లేకపోవడం వల్ల పరిస్థితులు మరింతగా దిగజారతాయి.

పేదలు, సామాన్యులపై భారం

ఈ సమస్యలను తక్షణం పరిష్కరించడానికి తగిన చర్యలు చేపట్టాలి. పట్టణ, నగర ప్రాంతాలలో తగిన ప్లానింగ్ లేకపోవడంతో వేసవి కాలపు పర్యవసానాలకు పేదజనం బలికావాల్సి వస్తుంది. ఆన్‌లైన్ ఆర్డర్లు అందించే పనిలో ఉండే డెలివరీ కుర్రాళ్లు క్షణం విశ్రాంతి లేకుండా ఊరంతా తిరుగుతూ ఉంటారు. ఆటోడ్రైవర్లు జీవనోపాధి కోసం ఎండనబడి ఆటో నడుపుతూనే ఉంటారు. ఇక నిర్మాణ రంగ కార్మికులు పగలంతా ఎర్రటి ఎండలో పనిచేస్తుంటారు. వాళ్లకి నిలువ నీడ ఉండదు. డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఉండేందుకు తగిన సౌకర్యాలు ఉండవు. ఇంటి పనివాళ్లు కాలినడకన ఎండనబడి పనికి వెళ్లి వస్తుంటారు. చిరు వ్యాపారులు సైకిళ్లు, తోపుడు బళ్ల మీద వీధివీధి తిరుగుతూ ఉంటారు. ఎండ వేడిమికి జనం బయట తిరగడం తగ్గిస్తారు కాబట్టి...వీళ్లు రోజు గడవడం కోసం ఇల్లిల్లూ తిరిగి సరుకు అమ్ముతుంటారు. వీళ్లంతా తీవ్ర వేసవి తాపానికి గురవుతుంటారు. దీనికి తోడు వాయు కాలుష్యం. నీడలో సేద తీరడానికి అవకాశాలు లేక అల్లాడి పోతుంటారు.

పట్టణ, నగర ప్రణాళికా లోపాలను సరిదిద్దాలనే రాజకీయ సంకల్పం కరవయ్యింది. డబ్బు, పరపతి గల వాళ్లదే రాజ్యంగా మారింది. వీళ్లకు ఉండే సౌకర్యాల మూలంగా వేసవి తాపాలు దరి చేరవు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మనలో కార్యాచరణ శక్తిని నీరుగారుస్తుంది. వాతావరణ ప్రభావాలను తట్టుకునేందుకు తగిన మార్పులు చేపట్టాలనే కఠిన వాస్తవాలను విస్మరింపచేస్తుంది. తిండి సహా అన్ని నిత్యావసరాలను నేరుగా మన ఇంటి గుమ్మం దగ్గరకు చేర్చే 'యాప్'లు వచ్చేశాక ఎంత ఎండ ఉంటే ఏంటన్న బేఖాతరుతనం అలవాటయిపోయింది. ప్రయాణాలకు, ఇంట్లో చిన్న చిన్న మరమ్మతులకు కూడా 'యాప్'లు వచ్చేశాయి.

నిరుద్యోగం ప్రబలంగా ఉన్న మన దేశంలో ఈ 'యాప్'ల వ్యవస్థ అనాలోచిత పర్యావసనాల గురించి పౌర సమాజంలో చర్చే లేకుండా పోయింది. వాస్తవానికి ఈ 'గిగ్' వ్యవస్థ సామాజిక పర్యవసనాలను లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఈనాడు ఎంతైనా ఉన్నది.

నూతన సాంకేతిక పరిజ్ఞానం 'విలాసం' అన్న పదం అర్థాన్నే మార్చేసింది. 'సౌకర్యం' అనే ఉచ్చులో పడి బాహ్య ప్రపంచంతో మానవ సంబంధాలు పలుచబడిపోతున్నాయి. మనుషులను

> **పట్టణ, నగర ప్రణాళికా లోపాలను సరిదిద్దాలనే రాజకీయ సంకల్పం కరవయ్యింది. డబ్బు, పరపతి గల వాళ్లదే రాజ్యంగా మారింది. వీళ్లకు ఉండే సౌకర్యాల మూలంగా వేసవి తాపాలు దరి చేరవు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మనలో కార్యాచరణ శక్తిని నీరుగారుస్తుంది. వాతావరణ ప్రభావాలను తట్టుకునేందుకు తగిన మార్పులు చేపట్టాలనే కఠిన వాస్తవాలను విస్మరింపచేస్తుంది. తిండి సహా అన్ని నిత్యావసరాలను నేరుగా మన ఇంటి గుమ్మం దగ్గరకు చేర్చే 'యాప్'లు వచ్చేశాక ఎంత ఎండ ఉంటే ఏంటన్న బేఖాతరుతనం అలవాటయిపోయింది.**

అంతకంతకూ ఇంటికే పరిమితం చేసి పర్యావరణం, పరిసరాలకు దూరం చేస్తుంది. 'గిగ్' కార్మికుల పట్ల సహజంగా ఉండాల్సిన సహానుభూతి కూడా లోపిస్తున్నది. అపార్ట్‌మెంట్లలో అయితే ప్రధాన ద్వారం దగ్గర కాపలా ఉండే గార్డులే డెలివరీలు అందుకుంటున్నారు. మనుషులతో నేరుగా కలిసే ధోరణి అడుగంటిపోతున్నది. సౌకర్యం పేరిట మనం అదనంగా నాలుగు రూపాయలు చెల్లించడానికి సిద్ధపడుతున్నాం కానీ 'మనం ఏం కోల్పోతున్నాం?' అనే గ్రహింపు లేకుండా పోతున్నది. అన్నిటికీ మించి పర్యావరణ మార్పుల ప్రభావం పట్టణ, నగర ఉన్నత తరగతుల ప్రజానీకాన్ని తాకనైనా తాకదు కాబట్టి వారు ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఇదే ఉన్నత తరగతి ప్రజానీకానికి మౌలిక సౌకర్యాలలోగానీ, ప్రజాప్రయోగ సేవలలో కానీ ఏమాత్రం లోటు జరిగినా అది మీడియాలో పెద్ద వార్త అవుతుంది. ఉదాహరణకు ఇటీవల ఢిల్లీలో కురిసిన ఆకస్మిక భారీ వర్షాల మూలంగా ధనవంతుల కాలనీలలో, పార్లమెంటు సభ్యులు నివాస ప్రాంతాలలో బేస్‌మెంట్ వరకు వర్షపు నీరు చేరేసరికి అధికార యంత్రాంగం హుటాహుటిన పనిలోకి దిగింది. మామూలు జనం పడ్డ ఇక్కట్లు సోయే లేకుండా పోయింది.

ప్రభుత్వ పాఠశాలలు, ప్రజా రవాణా వ్యవస్థల పట్ల కూడా మీడియా ఇదే ధోరణి అనుసరిస్తుంది. మనం మెల్లిగా ఒక విష వలయంలోకి జారిపోతున్నాం. వేసవి ఉష్ణతాపాలు జనాన్ని ఇంటి



గుమ్మం దాటనీకుండా చేస్తుంటే డబ్బున్న వాళ్లు దానినే సౌకర్యంగా మార్చుకుంటున్నారు. లేని వాళ్లు పడే ఇక్కట్ల గురించి పట్టింపే లేకుండా ఉన్నారు. అందుకే వాళ్లు ప్రజోపయోగ సౌకర్యాలు, సేవలు ఎట్లా ఉన్నా పట్టించుకునే పరిస్థితుల్లో లేరు.

సాంకేతిక పరిజ్ఞానం మన రోజు వారీ జీవితంలో పెనవేసుకుపోతున్న కొద్దీ అది మన జీవన శైలిని, మన ఆకాంక్షలను ప్రభావితం చేస్తున్నది. అయితే ఈ సాంకేతిక పరిజ్ఞానం సాధారణ ప్రజానీకం జీవన ప్రమాణాలు మెరుగయ్యేందుకు ఏ మాత్రం తోడ్పడం లేదు.

మానవ సంబంధాల పునరుద్ధరణ

ప్రజలు ఈ 'సౌకర్యం' అనే ఉచ్చు నుండి తమను తాము విడగొట్టుకోవాలి. మనం నివసించే నగరంలో, పట్టణంలో మన సంబంధాలను పునరుద్ధరించుకోవడం అసాధ్యమేమీ కాదు. అది మానవ సమూహ జీవనానికి తొలి మెట్టు. 'సౌకర్యం' అనే పొరబాటు భావనను తొలగించుకొని మన చుట్టూ ఉన్న ప్రపంచంలో మౌలికంగా ఏం మార్పులు చోటు చేసుకుంటున్నాయో గుర్తించాలి. వాతావరణంలో వస్తున్న తీవ్ర మార్పుల మూలంగా మనం ఆరు బయట కార్యకలాపాలను ఆస్వాదించే పరిస్థితుల్లో లేకుండా పోయాం. కాబట్టి పట్టణ, నగర ఉన్నత తరగతి ప్రజానీకం ఇప్పటికైనా మేల్కొని మన సామాజిక జీవన పరిస్థితులు మెరుగ్గా ఉండేందుకు ప్రభుత్వంతో చురుగ్గా తలపడాలి. అప్పుడే మన నివాస ప్రాంతాన్ని పట్టణాన్ని, నగరాన్ని ప్రజలందరూ ఆహ్లాదకరంగా ఆస్వాదించి సౌకర్యవంతంగా జీవించే అవకాశం ఏర్పడుతుంది.

మన నిర్లక్ష్యం, నిర్లిప్తతలు...మన పట్టణాలు నగరాలు మృతప్రాయంగా మారడానికి తోడ్పడకూడదని ఆశిద్దాం.

(రోహిత్ కుమార్ 'యంగ్ లీడర్స్ ఫర్ యాక్టివ్ సిటిజన్‌షిప్' (వై.ఎల్.ఎ.సి) సహ వ్యవస్థాపకుడు. అక్షత్ సోగాని వై.ఎల్.ఎ.సి లో మాజీ అసోసియేట్)

('హిందూ' సౌజన్యంతో)

కవిత్వం

హెచ్చరిక...

తుఫాన్ హెచ్చరిక
ఉడుం పట్టులా పట్టిన ముసురు
నగరం కాన్వాస్ మీద
వర్షం సముద్రమైంది
ఎటుచూసినా ఊరు ఎదమీద
టీ నీళ్ల పొంగిపొరలుతున్న చిత్రం.

ఎవరి వియోగ వేదనో
ఎడతెరిపి లేని కుండపోతగా
చావు బతుకుల నిడివి కురుస్తోందని
లోతట్టు ప్రాంత పేద ప్రజల బాధ
ముగియు బ్రతుకు కాబోలు అంటూ
వేటకు వెళ్లిన జాలరి కుటుంబ వ్యధ
వలసవనంలో బిడ్డ వైనంగూర్చి
కలవర పడుతున్న ఒక తల్లితలపు.

గుంతలా, ఏరులా, నదిలా
వాగులా, వంకలా
రూపాంతరం చెందుతున్న చినుకు
వాసనలు వీడి వాడిపోయిన
రంగుల పూలమొక్కలు..

వార్తా కథనాల్లో చిత్తడి కబుర్లు చూస్తూ
అందరి చిత్తములు ఉద్విగ్నభరితమై
ఇతర అన్ని చింతలు మునిగేయి..

వరద భీకర పరిస్థితిపై పాలక ఉవాచ
గాయం ఎలాంటిదైనా మాన్పించి
సాయం అందేలా చేయడమే లక్ష్యం
నమ్మశక్యం గాని వైనములు అన్నీ
పగలే చీకటి, భయపెట్టే చలిపులి.

ప్రకృతిని బాధించినప్పుడే
పెనుప్రమాదంలో మానవజాతి
పడి కొట్టుకుపోతుంది..
ఆపనెవ్వరి తరం..
ఆగం చేయడమే సందర్భం..!!

- డాక్టర్ పెరుగు రామకృష్ణ,
సెల్ : 9849230443

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట

నవంబరు 26న దేశవ్యాప్త ఆందోళనలు

- 500 జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు
- కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న అమర్జీత్ కౌర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
కేంద్రంలోని బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శ్రామికలోకం ఉద్యమానికి సంసిద్ధమైంది. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వచ్చే నవంబరు 26న దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని, 500 జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాల వేదిక (సిటియు), సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నిర్ణయించాయి. ఈ మేరకు గురువారం సిటియు, ఎస్‌కెఎం సంయుక్త సమావేశం ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో జరిగింది. మోడీ సర్కార్ అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలకు, ప్రజా వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సమావేశం తీర్మానించింది. కోవిడ్ మహమ్మారి విజృంభణ నేపథ్యంలో 2020లో లాక్‌డౌన్ విధించిన సమయంలో కేంద్ర కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మె చేపట్టాయి. అదే ఏడాది కర్షకలోకం చారిత్రాత్మక రైతు పోరాటాన్ని సాగించింది. ఈ రెండు పోరాటాల నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే నవంబరు 26న దేశవ్యాప్తంగా భారీ ప్రజా సమీకరణతో ప్రదర్శనలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

వ్యవసాయ కార్మికులు, మహిళలు, యువకులు, విద్యార్థులు తదితర అన్ని సంఘాలు, ప్రజా వేదికలు ఈ పోరాటంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర కార్మిక సంఘాల నుండి తపన్ సేన్ (సిఐటియు), అమర్జీత్ కౌర్ (ఎఐటియుసి), అశోక్ సింగ్ (ఐఎన్‌టియుసి), హర్భజన్ సిద్ధూ (హెచ్‌ఎంఎస్), ఆర్‌కె శర్మ (ఎఐయుటియుసి), రాజీవ్ డిమ్రీ (ఎఐసిసిటియు), సోన్యా జార్జ్ (ఎస్‌ఇడబ్ల్యుఎ), రాకేష్ మిశ్రా (టియుసిసి), శత్రుజీత్ (యుటియుసి), అలాగే ఎస్‌కెఎం నాయకులు డాక్టర్ అశోక్ ధావలే, డాక్టర్ దర్శన్ పాల్, రాజన్ క్షీరసాగర్, రాజారామ్ సింగ్, హన్నన్ మొల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ప్రచారం

మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ, పలు రాష్ట్రాల్లో జరుగనున్న ఉప ఎన్నికల్లోనూ బిజెపిని ఓడించేందుకు ప్రచారం నిర్వహించాలని ఎస్‌కెఎం రైతులకు, ప్రజలకు పిలుపునిచ్చింది. 'బిజెపిని సాగనంపుదాం...బిజెపిని వ్యతిరేకిద్దాం...శిక్షిద్దాం' పేరిట విస్తృత ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో జరిగిన ఎస్‌కెఎం జనరల్ బాడీ సమావేశంలో తీర్మానించారు. రాష్ట్ర జాబితాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను అగ్రికల్చర్ మిషన్ పేరుతో లాక్కోవడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఎస్‌కెఎం నేతలు విమర్శించారు. ఎరువులకు ఇస్తున్న రాయితీలను ఎన్‌డిఎ ప్రభుత్వం భారీగా కోతలు విధించిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే నయవంచక విధానాలను మోడీ సర్కార్ అనుసరిస్తోందని, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు దానికి వత్తాసు పలుకుతున్నాయని తప్పుబట్టారు. ఈ సమావేశానికి అధ్యక్షవర్గంగా ఎస్‌కెఎం నేతలు జగ్‌మోహన్ సింగ్, హన్నన్ మొల్లా, రాజన్ క్షీరసాగర్, పద్మ పళ్ళం, జోగిందర్ సింగ్ నైన్, సిదాగౌడ మోదగి, డాక్టర్ సునీలం ఉన్నారు. డాక్టర్ దర్శన్ పాల్ నివేదికను ప్రవేశపెట్టారు. పి కృష్ణ ప్రసాద్ ముగింపు ఉపన్యాసం చేశారు.

క్రమశిక్షణ డిమాండ్లను నెరవేర్చడానికి ఎన్‌డిఎ-3 ప్రభుత్వానికి మూడు నెలల వ్యవధి ఇస్తున్నట్లు సిటియు, ఎస్‌కెఎం నేతలు తెలిపారు. ఈ గడువు లోగా తమ డిమాండ్లను నెరవేర్చకపోతే దేశవ్యాప్తంగా నిరవధిక పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

మిలిటరీ దంపతుల ఆత్మహత్య

- భర్త ఆగ్రాలో.. భార్య ఢిల్లీలో

న్యూఢిల్లీ : భారత సాయుధ దళాల్లో పనిచేస్తున్న ఓ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఐఎఎఫ్, ఆర్మీలో కెప్టెన్‌గా విధులు నిర్వహిస్తున్న వారిద్దరూ.. వేర్వేరు నగరాల్లో ఒకేరోజు ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. దీన్ దయాల్ దీప్ (32) ఆగ్రాలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఐఎఎఫ్ ఫ్లైట్ లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్నారు. అదే నగరంలోని సైనిక ఆస్పత్రిలో అతడి భార్య రేణు తన్వర్ ఆర్మీలో కెప్టెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే.. ఇటీవల తన్వర్ తన తల్లి, సోదరుడితో కలిసి వైద్య చికిత్స కోసం ఢిల్లీకి వెళ్లారు. ఇంతలో ఏమైందో తెలియదు.. ఒకేరోజు ఈ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాత్రి భోజనం తర్వాత గదిలోకి వెళ్లిన దీప్ మరుసటి రోజు బయటకు రాకపోవడంతో సహోద్యోగులు తలుపు పగలగొట్టి చూడగా, ఉరికి వేలాడుతూ కనిపించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

భోజన సమయంలో దీప్ తమతో సరదాగానే మాట్లాడారని.. అప్పుడు అతడి ముఖంలో ఎలాంటి ఆందోళన కనిపించలేదని సహోద్యోగుల్లో ఒకరు వెల్లడించారు. ఉదయం ఎంతసేపటికీ బయటికి రాకపోవడంతో అనుమానంతో తలుపులు పగలగొట్టి చూసేసరికి దీప్ విగతజీవిగా కనిపించారని పోలీసులు తెలిపారు. మరోవైపు.. ఆదేరోజు తన్వర్ కూడా ఢిల్లీ కంటోన్మెంట్‌లోని అధికారుల మెస్ హాల్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఆయనతో పాటే నాకూ దహన సంస్కారాలు చేయండి

అక్కడున్న సిబ్బంది సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. ఆమె మృతదేహం పక్కన సూసైడ్ నోటును స్వాధీనం చేసుకున్నారు. తన భర్త మృతదేహంతో కలిపి తనకూ దహన సంస్కారాలు నిర్వహించాలని ఆమె కోరారు. తన్వర్ ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో ఆమె తల్లి, సోదరుడు ఆస్పత్రిలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే.. దీప్ వద్ద ఎలాంటి సూసైడ్ నోటు లభ్యం కాలేదు. దీంతో అతడి మృతిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పౌరసత్వ చట్టంలో సెక్షన్ 6ఎ రాజ్యాంగబద్ధమే !

- 4:1 మెజారిటీతో తీర్పునిచ్చిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎ రాజ్యాంగ బద్ధతను సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం 4:1 మెజారిటీతో తీర్పు వెలువరించింది. జస్టిస్ జె.బి.పార్దీవాలా మాత్రం ఈ సెక్షన్ రాజ్యాంగ విరుద్ధమైనదని అభిప్రాయపడ్డారు. అస్సాంలో అక్రమ వలసదారులకు భారత పౌరతస్వం మంజూరు చేయడానికి సంబంధించినది ఈ సెక్షన్. అక్రమ వలసల సమస్యకు అస్సాం ఒప్పందం రాజకీయ పరిష్కారాన్ని అందించిందని చంద్రచూడ్ పేర్కొన్నారు. 1955లో తీసుకువచ్చిన పౌరసత్వ చట్టంలో సెక్షన్ 6ఎను ప్రత్యేక నిబంధనగా పొందుపరిచారు. 1985 ఆగస్టు 15న అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం, అస్సాం ఉద్యమ నేతలతో చర్చలు జరిపి ఒప్పందాన్ని కుదుర్చుకుని సంతకాలు చేసింది. అక్రమ శరణార్థులను గుర్తించి, వారిని తరలించాలనే డిమాండ్‌తో ఆరేళ్ళ పాటు అఖిల అస్సాం విద్యార్థుల యూనియన్ (అసు) ఆందోళనలు, ఉద్యమాలు జరిపింది.

తదుపరి సిజెఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా...!

(మొదటి పేజీ తరువాయి)

ఆ పదవిలో కేవలం ఏడు నెలలు మాత్రమే ఉంటారు. 2025 మే 13 ఆయన రిటైర్ కానున్నారు.

జీవిత విశేషాలు : జస్టిస్ సంజీవ్ ఖన్నా 1960 మే 14న జన్మించారు. 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కాంప్లెక్స్‌లోని జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేశారు. జస్టిస్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు, ట్రిబ్యునళ్లలో ప్రాక్టీస్ చేశారు. ఆదాయపు పన్ను శాఖకు సంబంధించి సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్ గా పనిచేశారు. జస్టిస్ ఖన్నా 2004లో ఢిల్లీలోని నేషనల్ క్యాపిటల్ టెరిటరీలో చేరారు. ఢిల్లీ హైకోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, అమికస్ క్యూరీగా అనేక క్రిమినల్ కేసులకు హాజరై వాదించారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టులోని తన పదవీకాలంలో జస్టిస్ ఖన్నా ఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ, ఢిల్లీ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్, డిస్ట్రిక్ట్ కోర్ట్ మధ్యవర్తిత్వ కేంద్రాలకు చైర్మన్, ఇన్‌చార్జ్ జడ్జిగా కూడా పనిచేశారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఏదైనా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కాకముందే సుప్రీంకోర్టుకు ఎదిగిన కొద్దిమందిలో జస్టిస్ ఖన్నా ఒకరు. ఆయన ప్రస్తుతం భోపాల్‌లోని నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగానూ, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గానూ ఉన్నారు. 2023 జూన్ 17 నుంచి 2023 డిసెంబర్ 25 వరకు సుప్రీం కోర్టు లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

ముఖ్యమైన తీర్పులు : వివాదాస్పద సెంట్రల్ విస్టా ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సుప్రీంకోర్టు ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా కూడా ఉన్నారు. జమ్మూ కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనంలో ఆయన సభ్యుడిగా ఉన్నారు. ఎలక్టోరల్ బాండ్లను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించిన ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా కూడా ఉన్నారు. జస్టిస్ ఖన్నా పలు కీలక కేసుల్లో కూడా ఆదేశాలు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని చెప్పారు. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కేసులో జస్టిస్ ఖన్నా కీలక తీర్పు వెలువరించారు. 2023లో ఒక టీవీ షోలో జర్నలిస్టు వ్యాఖ్యలపై కేసును విచారిస్తున్నప్పుడు, ఆర్టికల్ 21 హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కును అధిగమించడానికి, ఆర్టికల్ 19(1)(ఎ)ని ఉపయోగించలేమని జస్టిస్ ఖన్నా నేతత్వంలోని బెంచ్ నొక్కి చెప్పింది. "ఎవరైనా మాట్లాడే హక్కును నొక్కిచెప్పినట్లయితే, ఇతరులకు వినడానికి లేదా వినకుండా ఉండటానికి హక్కు ఉంటుంది" అని బెంచ్ పేర్కొంటూ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసింది.

27న ఉరుగ్వే సార్వత్రిక ఎన్నికలు

మాంటెవీడియో : ఈ నెల 27న ఉరుగ్వే సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. దేశ అధ్యక్షుడిని, పార్లమెంట్ సభ్యులను ఓటర్లు ఎన్నుకోనున్నారు. ఎన్నికల మొదటి రౌండ్‌లో స్పష్టమైన విజేతను సూచించేలా ఇప్పటివరకు రాజకీయ పార్టీల మధ్య పెద్ద తేడా కనిపించడం లేదు. అయితే, మితవాద సంకీర్ణ కూటమి, మధ్యే వామపక్ష వాద పార్టీ ఈ రెండూ అధికంలో ఉండేవున్నాయని భావిస్తున్నారు. మొదటి రౌండ్‌లో అధిక సంఖ్యలో ఓట్లు వచ్చిన అభ్యర్థి అభ్యర్థికి మద్దతునివ్వడానికి అంగీకరించిన పలు మితవాద పార్టీల కూటమి కూడా బరిలో వుంది. ఈ కూటమిలోని పార్టీలు మొదటి రౌండ్‌లో వేర్వేరుగానే పోటీ చేస్తున్నప్పటికి రెండో రౌండ్‌లో కలిసి మద్దతునివ్వాలని నిర్ణయించాయి. ఎన్నికల నిర్వహణా సంస్థ పోల్‌స్టార్ వెల్లడించిన వివరాల ప్రకారం, మితవాద అభ్యర్థికి 48 శాతం వరకు ఓట్లు వచ్చే అవకాశం వుందని, అదేసమయంలో మధ్యేమార్గ వామపక్షవాద పార్టీకి 44 శాతం ఓట్లు వస్తాయని తెలిపింది. మితవాద పార్టీదే మెజారిటీ సీట్లు పొందే అవకాశాలు కనిపిస్తున్నాయని పేర్కొంది.

మారుమూల గ్రామంలో చిక్కుకుపోయిన సిఇసి

న్యూఢిల్లీ : వాతావరణం సరిగా సహకరించక అత్యవసరంగా విమానం ల్యాండ్ అవడంతో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఉత్తరాఖండ్‌లోని మారుమూల ప్రాంతంలో ఒక కుగ్రామంలో చిక్కుకుపోయారు. బుధవారం రాత్రంతా ఆయన అక్కడే గడిపారు. ఆయనతో పాటు ఇద్దరు పైలట్లు, ఇద్దరు ఎన్నికల అధికారులు కూడా వున్నారు. వాతావరణం మెరుగుపడగానే గురువారం హెలికాప్టర్ బయలుదేరి మున్స్యారి తహసీల్ ప్రధాన కార్యాలయాన్ని సురక్షితంగా చేరుకుందని అధికారవర్గాలు తెలిపాయి. అత్యంత ఎత్తైన పర్వత ప్రాంతంలో ఓటర్లు, ఎన్నికల అధికారులు ఎదుర్కొనే సవాళ్ళ గురించి తెలుసుకోవడానికి రాజీవ్‌కుమార్ పితోర్‌ఘర్, దాని చుట్టుపక్కల గల పోలింగ్‌స్టేషన్లను సందర్శించాల్సి వుంది. మిలమ్ గ్లేసియర్‌కు వెళ్ళే మార్గంలో బుధవారం వాతావరణం అనుకూలించక పోవడంతో అత్యవసరంగా ల్యాండ్ అయింది.



మీకోసం

చలికాలంలో చర్మం పొడిబారకుండా ఉండడానికి గ్లిజరిన్ సబ్బులు వాడితే మంచిది.

జీవన సౌరభం

ధైర్యంగా వేసే ప్రతి అడుగులోనూ భయపెట్టే విమర్శలే వస్తుంటాయి. వింటూ ఆగిపోవడమా.. వినకుండా సాగిపోవడమా.. అనేది మనం వేసే అడుగులోనే ఉంటుంది.

దసరాకి భలే సరదా చేశా..



హాయ్ ఫ్రెండ్స్, నా పేరు వేద్య. నేను మూడవ తరగతి చదువుతున్నాను. దసరా సెలవుల్లో నేను తొక్కుడు బిల్లు ఆడాను. అది చాలా సరదాగా ఉంది. కథల పుస్తకాలు చదివాను. తర్వాత రోజు నేను కళ్యాణ మండపంలో మా స్నేహితులతో ఆడుకున్నాను. అది ఇంకా సరదాగా ఉంది. అక్కడ నేను చాలా కొత్త ఆటలు తెలుసుకున్నాను. తర్వాత రోజు నేను విజయవాడ వెళ్లాను. అమ్మ నన్ను గుడికి తీసుకెళ్లింది. తర్వాత రోజు నేను మా అమ్మమ్మ ఇంటికి వెళ్లాను, అక్కడ మా తాతయ్య నాకు కొత్త బట్టలు, కొత్త బొమ్మలు కొనిచ్చాడు. తర్వాత రోజు ఇంటికి వచ్చాను. మా అమ్మ నాకు చాలా పిండి వంటలు చేసింది, అవి భలే రుచిగా ఉన్నాయి. దసరా రోజంతా మా స్నేహితులతో కలిసి ఆడాను. వారి పేర్లు కావ్య, అను, సాయి. ఆ ఆటలు కూడా నాకు బాగా నచ్చాయి. ఇలా నా దసరా సెలవులు జాలీగా గడిపాను.



– ఎస్. వేద్యశ్రీ,
మూడవ తరగతి,
అరవింద మోడల్ స్కూల్,
మంగళగిరి.

నేనే హీరో..!

నేనే! నేనే! నేనే! హీరో!
నేనేదైనా, చేసేస్తా!

అమ్మతో పెళ్ళికి వెళ్ళొచ్చా
ఫొటోలు వీడియో తీశారూ
తీసిన తీరూ చూసొచ్చా
కెమెరా ఇప్పుడు నాకుంటే
సూపర్ ఫొటోలు తీసేస్తా
సినిమా కూడా చేసేస్తా ,,,

బస్సును, రైలును ఎక్కేశా
తాత ఊరికీ వెళ్ళొచ్చా
డ్రైవర్నిప్పుడు నేనైతే
బస్సును బుర్రున నడిపేస్తా
పచ్చని జెండా నాకిస్తే
రైలు బండినీ కదిలిస్తా ...

మామ ఊరికీ వెళ్లొచ్చా
కంప్యూటర్నూ చూసొచ్చా
కంప్యూటర్ నాకుంటేనా
కీబోర్డ్ టపటపలాడిస్తా
ఇంగ్లీష్ మొత్తం నేర్చేస్తా
మౌస్‌తో సినిమా చూసేస్తా ...

నేనిపుడన్నీ నేర్చేశా
ఏ పనినైనా చేసేస్తా
ఇప్పుడు నాకు విమానముంటే
ఆకాశంలో విహరిస్తా
మేఘంపైనే పడుకుంటా
సూర్యుని, చంద్రుని చుట్టేస్తా
చుక్కల లోకం చూసొస్తా ...

– మద్దిరాల శ్రీనివాసులు

నేను గీసిన బొమ్మ





ఎస్‌కె. మోహ్సినా,
9వ తరగతి,
అరవింద హైస్కూల్, సిబిఎస్ఇ,
కుంచనపల్లి, గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రమాదాలతో పయనం..

మనుగడ కోసం ఎంతోమంది ప్రమాదకర పరిస్థితుల్లో పనులు చేస్తూ ఉంటారు. నిప్పులు చెరిగే ఎండల్లో, విషవాయువులు చిమ్మే గనుల్లో.. ఇలా ఎన్నో చోట్ల నిత్యం శ్రమిస్తుంటారు. అలాంటి ప్రాంతమే భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు తీర ప్రాంతం సుందరబాన్. ఇక్కడ వాతావరణ ప్రతికూలతలకి తోడు వన్యమృగాల భయంతో రోజులు గడపాలి. ఇలాంటి పరిస్థితుల్లోనే అక్కడ కుటుంబాలు సాఫీగా నడవాలంటే పురుషులతో పాటు మహిళలు కూడా కష్టపడాల్సిందే.. పులులు, వన్యమృగాలతో నిత్యం పోరాడాల్సిందే.. పీతల వేట, సముద్రం నాచు సేకరణకై రోజూ వందల సంఖ్యలో మహిళలు చిన్న చిన్న మర పడవలను తీసుకుని సముద్రంలోకి వెళ్లడం అక్కడ రోజూ కనిపిస్తుంది. గ్రామాలు, నగరాల జీవనానికి పూర్తి భిన్నమైన జీవనం వారిది.



చేపల వేట ఇక్కడి ప్రజల ముఖ్య ఆదాయ వనరు. తాతముత్తాతల కాలం నుండీ ఇదే వారి ప్రధాన వృత్తి. సముద్రాన్ని కాపాడే నెపంతో, సుందర్‌బాన్ అడవులను రక్షించే సాకుతో వారి చుట్టూ ఎన్నో ఆంక్షలు. వలయాలు. అయినా అదురు బెదురు లేకుండా, 'అడవిని, సముద్రాన్ని రక్షించే నిజమైన వారసులం మేమే' అంటూ వారి రోజు మొదలౌతుంది. వేటాడేందుకు ప్రభుత్వం ఇచ్చే లైసెన్సుల కోసం ఏళ్ల తరబడి పోరాటాలు చేస్తే పురుషులకు మాత్రమే మంజూరుచేసి, చేతులు దులుపుకున్నారు. అయినా ఆ మహిళలు ఎక్కడా నిరుత్సాహ పడకుండా యథావిధిగా తమ పనులు చేసుకుపోతున్నారు. 'మాకు కూడా లైసెన్సులు ఇస్తే.. అదే నిజమైన దీపావళి' అంటున్న ఆ మహిళల్లో కొంతమంది జీవితాలను చూద్దాం.

కళ్లెదుటే పులి చంపేసింది

ఊర్మిళా సర్దార్ 40 ఏళ్ల నుండి వేటకి వెళుతోంది. పీతలు, చేపలు పట్టడం ఆమె దినచర్య. ఈ ప్రయాణంలో ఒకసారి ఆమె కళ్లెదుటే తన భర్తని ఓ పులి ఈడ్చుకెళ్లి చంపేసింది. 'ఆ రోజు పులి క్రూరత్వం, నా భర్త దీనచూపులు నాకు ఇప్పటికీ బాగా గుర్తు. ఆ దారుణం నా కళ్లముందే జరుగుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో నా శరీరంలో విపరీతమైన వణుకు పుట్టింది. ఆ భయం వల్లే అప్పటి నుండి నా ఒళ్లంతా వణుకుతూ ఉంటోంది. మాట కూడా స్పష్టంగా రావడం లేదు' అంటున్న ఆమె అదే అడవికి పులి తన భర్తని చంపిన అదే మార్గంలో ఇప్పుడూ వేటకి వెళుతోంది.

నిండు గర్భంతోనే వేట..

సుందర్‌బాన్ తీరం మాదిరే, గల్ఫ్ ఆఫ్ మన్నార్ అని పిలిచే ప్రాంతం కూడా అక్కడ ఉంది. ఆ ప్రాంతంలో నమ్మా తాయి అనే 80 ఏళ్ల వృద్ధురాలు రోజూ సముద్రం నాచు సేకరిస్తూ ఉంటుంది. ఆమెకి ఏడేళ్లప్పటి నుండే ఈ పనిలో నిమగ్నమైంది. 'వేటకి వెళ్లి నేను సంపాదిస్తేనే కుటుంబం గడిచేది. నిండు గర్భిణీగా ఉన్నా వేట మానేదాన్ని కాదు. అలా వెళ్లినప్పుడు ఒకసారి మార్గమధ్యంలో నాకు ప్రసవ నొప్పులు వచ్చాయి. అప్పుడే తుపాను కూడా మొదలైంది. బిడ్డని కని, గ్రామం చేరేసరికి ఏడు రోజులు పట్టింది' అని ఆమె తన అనుభవాన్ని చెప్పింది.

బిడ్డని సాకాలని..

పరౌలి హర్దార్‌ది మరో కథ. సాఫీగా సాగిపోతున్న ఆమె జీవితంలో అనుకోని ప్రమాదం భర్తని మింగేసింది. ఒక్కగానొక్క కూతురుని సాకాలని, పుట్టెడు దు:ఖాన్ని దిగమింగుకుని వేటకి వెళుతోంది. '20 ఏళ్లుగా నేను ఈ వృత్తిని చేస్తున్నాను. బోన్‌బీబీ మేము కొలిచే దేవత. ఆమె మమ్మల్ని కాపాడుతుందని మేమంతా బలంగా నమ్ముతాం. ఆ దేవత పట్ల విపరీత మక్కువతో నేను, నా భర్త ఓ దేవాలయం నిర్మించాలను కున్నాం. అప్పు చేశాం. నిధులు సేకరించాం. దగ్గరుండి పనులు చేయించమని నన్ను ఇంటి దగ్గరే ఉంచి తను ఒక్కడే వేటకు వెళ్లాడు. మూడు రోజుల తరువాత శవమై తిరిగివచ్చాడు. పులి అతన్ని చంపేసింది. ఆ రోజు రాత్రి నా కూతురు ఏడుస్తూ నా దగ్గరికి వచ్చింది. 'అమ్మా.. నువ్వు రోజూ ఈ పూజలు ఎందుకు చేస్తున్నావు? ఈ బొమ్మ ఎక్కడి నుండి తెచ్చావో.. అక్కడే పడేయ్' అని బినోబీ బొమ్మని నదిలోకి విసిరేసింది. ఇప్పుడు నేను అనుభవిస్తున్న జీవితం నాది కాదు. నా బిడ్డది. తనని సాకేందుకు గుండె దిటవు చేసుకుని మరీ వేటకి వెళుతున్నాను' అంటూ పరౌల్ నాటి సంగతిని గుర్తుచేసుకుని బోరున విలపించింది.



సముద్ర నాచు సేకరిస్తూ..

ప్రమాదాలతో ప్రయాణం..

ఈ ప్రాంతంలో ఒక్కొక్క మహిళది ఒక్కో కథ. వేటలో తాము ఎదుర్కొనే వెతల గురించి రత్న బిశ్వాస్ అనే మహిళ ఇలా చెబుతోంది. 'మా అమ్మ, అమ్మమ్మ పీతల వేట, నాచు సేకరణ చేసేవారు. ఇదే మా ఆదాయం. ఇది తప్ప మాకు వేరే వనరు లేదు. వేటకి వెళితే 10, 12 రోజులు అక్కడే ఉండాలి. తీరం వెంబడి రెండు రోజులు ప్రయాణిస్తే కాని గమ్యం చేరం. మొసళ్లు, పాములు, పులుల భయంతో రాత్రింబవళ్లు మేల్కొనే ఉండాలి. చేపలు, పీతల కోసం పులులతో తలపడాలి. పులుల దాడిలోనే ఏడాదికి 80 నుండి వంద మంది చనిపోతారు' అని ఆమె తన అనుభవాలను చెబుతోంది.



సుందరబాన్ ప్రాంతం గంగా, బ్రహ్మపుత్ర నదులచే ఏర్పడిన డెల్టా ప్రాంతం. భారత్‌లో 40 శాతం మడ అడవులతో ఈ ప్రాంతం విస్తరించింది. ఈ తూర్పు తీరం భారతదేశ గొప్ప మత్స్య సంపదకు పెట్టింది పేరు. ఎన్నో అంతరించిపోతున్న జాతులకు నిలయం. 9,600 చదరపు కిలోమీటర్లు ఆవరించి ఉన్న ఈ భాగంలో సగానికి పైగా జనావాసాలు ఉండవు. నదులు, వాగులు, పాయలు, ద్వీపాలతో నిండిపోయిన చిట్టడివి ఇది. మొత్తం 102 ద్వీపాలలో 54 మాత్రమే నివాసాలకు అనువుగా ఉన్నాయి. ఇవి ప్రపంచంలోనే అతి పెద్ద మడ అడవులు. పులుల జనాభా అత్యధికంగా ఉన్న ఏకైక అడవులు కూడా ఇవే.

ఇక్కడ 25 లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఈ జనాభాలో దాదాపు సగం మంది షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సంబంధించిన భూమి లేని పేదవారే. వీరంతా ఈ అడవుల మీదే ఆధారపడి జీవిస్తున్నారు. చేపల వేట, తేనె, పండ్లు, వంట చెరకు సేకరణ పురుషుల ప్రధాన వృత్తి. పీతలు, నాచు సేకరణ మహిళల ఆదాయ వనరు.

దుర్భర దారిద్ర్యంలో 110కోట్ల మంది ప్రజలు !

- యుద్ధాలు, దాడులు, ఘర్షణలు నెలకొన్న దేశాల్లోనే సగం మంది
- భారత్‌లోనే అధికం
- శాంతితోనే పేదరిక నిర్మూలన !
- ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడి

న్యూయార్క్ : వంద కోట్ల మందికి పైగా ప్రజలు దుర్భర దారిద్ర్యంలో బతుకుతున్నారని ఐక్యరాజ్య సమితి ఒక నివేదికలో పేర్కొంది. వీరిలో దాదాపు సగం మంది యుద్ధాలు, దాడులు, ఘర్షణలతో సతమతమవుతున్న దేశాల్లోనే వున్నారని వెల్లడించింది. యుద్ధాలను ఎదుర్కొంటున్న దేశాలు బహుముఖ దారిద్ర్యానికి సంబంధించిన అన్ని సూచికల్లోనూ అధిక స్థాయిల్లో లేమిని ఎదుర్కొంటున్నాయని గురువారం ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) ప్రచురించిన సూచీ పేర్కొంది. పోషకాహారం, అందుబాటులో విద్యుత్, నీరు, పారిశుధ్యం వంటి విషయాల్లో మరింత తీవ్రమైన అసమానతలు నెలకొన్నాయని పేర్కొంది.

112 దేశాల వ్యాప్తంగా, 630కోట్ల మంది ప్రజలపై జరిగిన పరిశోధనల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 110కోట్ల మంది ప్రజలు అత్యంత దారుణమైన రీతిలో దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని పేర్కొంది. వీరిలో 45.5కోట్ల మంది ప్రజలు ఘర్షణల నీడల్లో జీవిస్తున్నారని మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ పేర్కొంది. ఇటీవలి సంవత్సరాల్లో ఘర్షణలు ఉధృతమయ్యాయి. ఎక్కడికక్కడ అనేక



రెట్లు పెరిగిపోయాయి. దీంతో మరణాలు కూడా అధికంగా నమోదవుతున్నాయి. రికార్డు స్థాయిల్లో లక్షలాదిమంది నిర్వాసితులవుతున్నారు. ఫలితంగా వారి జీవితాలకు, జీవనోపాధులకు తీవ్ర స్థాయిల్లో ఆటంకాలు ఎదురవుతున్నాయని యుఎన్‌డిపి నేత ఆచిమ్ స్టెయినర్ పేర్కొన్నారు.

18ఏళ్ళలోపు దాదాపు 58.4కోట్ల మంది ప్రజలు తీవ్రమైన పేదరికంలో మగ్గుతున్నారని సూచీ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా గల పిల్లల్లో వీరి సంఖ్య 27.9శాతంగా వుంది. యువత సంఖ్య 13.5శాతంగా వుంది. యుద్ధాలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్న ప్రాంతాలో పిల్లల మరణాలు 8 శాతంగా వున్నాయి. అదే సమయంలో శాంతి నెలకొన్న దేశాల్లో పిల్లల మరణాలు 1.1శాతంగా వుంది.

ప్రపంచంలోని నిరుపేదల్లో 83.2శాతం మంది సబ్ సహారా ఆఫ్రికా దేశాల్లో, దక్షిణాసియా దేశాల్లో జీవిస్తున్నారని పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ (ఒపిహెచ్‌ఐ) యుఎన్‌డిపి సంయుక్తంగా ఈ నివేదిక రూపొందించాయి. సరైన ఇళ్ళు లేకపోవడం, పారిశుధ్యం, విద్యుత్, వంట ఇంధనం, పోషకాహారం కొరత, స్కూళ్ళకు పిల్లలు హాజరయ్యే తీరును వివిధ స్థాయిల్లో అంచనా వేసి బహుముఖ దారిద్ర్యాన్ని అంచనా వేశారు.

ఆఫ్ఘనిస్తాన్‌పై వీరు కూలంకషంగా అధ్యయనం జరిపారు. దేశంలో దాదాపు మూడింట రెండు వంతుల మంది ప్రజలు గతేడాది నిరుపేదలుగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. 2016-16 నుండి 2022-23 మధ్య కాలంలో అదనంగా 53లక్షల మంది పేదరికం బారిన పడ్డారు. ఘర్షణలతో నిత్యం సతమతమయ్యే దేశాల్లో పేదలు కనీస అవసరాల కోసం జరిపే పోరాటం మరింత కఠినంగా వుంటోందని యుఎన్‌డిపి ముఖ్య గణాంక అధికారి యాంచున్ ఝూంగ్ వ్యాఖ్యానించారు.

దుర్భర దారిద్ర్యంతో జీవించే వారు భారత్‌లో అత్యధికంగా వున్నారు. 140కోట్ల మంది జనాభాలో 23.4 కోట్ల మంది పేదరికంలోనే మగ్గుతున్నారు. ఆ తర్వాత స్థానాల్లో పాకిస్తాన్, ఇథియోపియా, నైజీరియా, కాంగోలు వున్నాయి. 110కోట్ల మంది పేదల్లో దాదాపు సగం మంది ఈ ఐదు దేశాల్లోనే వున్నారు. దాడులు, ఘర్షణలు నెలకొన్న దేశాల్లో దారిద్ర్య నిర్మూలన చాలా మండకొడిగా వుందని ఒపిహెచ్‌ఐ డెరెక్టర్ సబీనా అల్కిరే తెలిపారు. అందువల్ల శాశ్వత శాంతిని నెలకొల్పనిదే దారిద్ర్య నిర్మూలన సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.

బీహార్‌లో మృత్యుఘోష

- కల్తీ మద్యానికి 32 మంది బలి

పాట్నా : కల్తీ మద్యంతో బీహార్‌లో సివాన్, సరన్ జిల్లాలకు చెందిన మరో 18 మంది మరణించారు. దీంతో గురువారం నాటికి గడిచిన 24 గంటల్లో కల్తీ మద్యం కారణంగా చనిపోయినవారి సంఖ్య 32కు చేరింది. ఇంకా అనేక మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, మృతుల సంఖ్య పెరిగే వీలుందని సంబంధిత అధికారులు తెలిపారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితంగానే సామాన్యులు కల్తీ మద్యానికి బలైపోతున్నారని ఆర్‌జెడి విమర్శించింది. సివాన్ జిల్లాలోని మఘర్, అవురియా పంచాయితీల్లో ఇప్పటి వరకు సుమారు



కల్తీ మద్యంతో 20 మంది మరణించారని సరాన్ రేంజ్ డిఐజి నీలేష్ కుమార్ గురువారం తెలిపారు. సరన్ జిల్లాలోని ఇబ్రహీంపురా ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు కూడా మరణించారని అన్నారు. ఈ నెల 15న కల్తీ మద్యం తాగడంతో సివాన్, సరన్ జిల్లాలకు చెందిన పలువురు అనారోగ్యానికి గురయ్యారు. వీరిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఇప్పటి వరకు 32 మంది మరణించారని అన్నారు. మరికొందరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.

వయనాడ్ ఉప ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ అభ్యర్థిగా మోకెరి

తిరువనంతపురం : కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలకు పాలక ఎల్‌డిఎఫ్ అభ్యర్థిగా సిపిఐ నేత సత్యన్ మోకెరిని పార్టీ బరిలోకి దింపింది. మోకెరి అభ్యర్థిత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం ప్రకటించారు. శాసనసభలో మోకెరికి గల అనుభవం, రైతు సంఘాలకు నాయకత్వం వహించడం వంటి లక్షణాలు వయనాడ్ ఓటర్లలో ఆయన స్థానాన్ని బలపరుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 1987 నుండి 2001 వరకు మూడు సార్లు నాదపురం నియోజకవర్గానికి మోకెరి ప్రాతినిధ్యం వహించారు. అఖిల భారత కిసాన్ సభ రాష్ట్ర కమిటీ సభ్యులుగా, ఉపాధ్యక్షులుగా పనిచేశారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి సీటును అట్టిపెట్టుకోవాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిర్ణయించడంతో వయనాడ్‌లో ఉప ఎన్నికలు అవసరమయ్యాయి. కాగా కాంగ్రెస్ తరపున ప్రస్తుతం ప్రియాంక గాంధీ పోటీ చేస్తున్నారు. ఇంతకుముందు జరిగిన ఎన్నికల్లో రాహుల్ గాంధీపై పోటీ చేసి సిపిఐ అభ్యర్థి అనీ రాజా ఓడిపోయారు.



హర్యానా సిఎంగా నయాబ్ సింగ్ సైనీ ప్రమాణ స్వీకారం

చండీఘడ్ : బిజెపి నేత నయాబ్ సింగ్ సైనీ గురువారం హర్యానా ముఖ్యమంత్రిగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఇద్దరు మహిళలతో సహా 13 మందితో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ పంచకులలో జరిగిన పదవీ స్వీకార వేడుకలో గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్యమంత్రి, మంత్రుల చేత ప్రమాణం చేయించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నలుగురు కేంద్ర మంత్రులు, బిజెపి అధ్యక్షులు జెపి నడ్డా సహా పలువురు ఎన్‌డిఎ నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కేబినెట్‌లో ఐదుగురు ఒబిసి నేతలకు చోటుదక్కింది. జాట్‌లకు చెందిన ఇద్దరికి, మరో ఇద్దరు ఎస్సీలకు మంత్రి పదవులు దక్కాయి.

టీమిండియా ధమాల్

- 46పరుగులకే కుప్పకూలిన రోహిత్ సేన
- టెస్టుల్లో మూడో అత్యల్ప స్కోర్
- న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్

బెంగళూరు: న్యూజిలాండ్ పేసర్ల ముందు టీమిండియా బ్యాటర్లు తేలిపోయారు. సొంతగడ్డపై తక్కువ పరుగులకే ఆలౌట్ కావడం, టెస్టుల్లో మూడో అత్యల్ప స్కోర్‌కు టీమిండియా పరిమితమైంది. ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా న్యూజిలాండ్‌తో గురువారం నుంచి ప్రారంభమైన తొలి టెస్ట్ రెండోరోజు టీమిండియా బ్యాటర్లు క్రీజ్‌లో కుదురుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. టాస్ గెలిచి ప్రత్యర్థి బౌలర్లను ఉతికారేయాలను కున్న కెప్టెన్ రోహిత్ శర్మ అంచనా తప్పింది. తొలిరోజు ఆట వర్షం కారణంగా పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా.. రెండోరోజు కివీస్ బౌలర్లు చెలరేగారు. మ్యాట్ హెన్రీ(5/15), విలియం రూర్కే(3/22)ల ధాటికి టీమిండియా బ్యాటర్లు ఐదుగురు డకౌటయ్యారు.. దీంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 46పరుగులకే కుప్పకూలింది. జైస్వాల్(13), పంత్(20) రెండంకెల స్కోర్ నమోదుచేయగా.. రోహిత్(2), కుల్దీప్(2), బుమ్రా(1), సిరాజ్(4నాటౌట్) సింగిల్ డిజిట్ పరుగులు చేశారు. ఇక కోహ్లి, సర్ఫరాజ్, కెఎల్ రాహుల్, జడేజా, అశ్విన్ డకౌట్ అయ్యారు. టీమిండియా ఇన్నింగ్స్ కేవలం 31.2ఓవర్లలోనే ముగిసింది. 36పరుగులకు 6వికెట్లు కోల్పోయిన టీమిండియా.. మరో 10 పరుగుల వ్యవధిలో చివరి నాలుగు వికెట్లను చేజార్చుకుంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్.. రెండోరోజు ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 186పరుగులు చేసింది. డెవాన్ కాన్వే(91) శతకానికి దగ్గర్లో ఔట్ కాగా.. కెప్టెన్ లాథమ్(15) బ్యాటింగ్‌లో రాణించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 67పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత విల్ యంగ్ 33పరుగులు చేసి ఔటయ్యాడు. రచిన్ రవీంద్ర(22), డారెల్ మిచెల్(14)లు క్రీజులో ఉండగా.. న్యూజిలాండ్ ఇప్పటికే 134 పరుగుల ఆధిక్యం సాధించింది.



టెస్టుల్లో టీమిండియా అత్యల్ప స్కోర్లు..

36 : ఆస్ట్రేలియా చేతిలో (2020 ఆడిలైడ్)
42 : ఇంగ్లండ్ చేతిలో(1976 లార్డ్స్)
46 : న్యూజిలాండ్ చేతిలో (2024, బెంగళూరు)
58 : ఆస్ట్రేలియా చేతిలో (1947, బ్రిస్బేన్)
58 : ఇంగ్లండ్ చేతిలో (1952, మాంచెస్టర్)

స్కోర్‌బోర్డు...

ఇండియా తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)అజాజ్ పటేల్ (బి)రూర్కే 13, రోహిత్ (బి)సోధీ 2, కోహ్లి (సి)ఫిలిప్స్ (బి)రూర్కే 0, సర్ఫరాజ్ (సి)కాన్వే (బి)హెన్రీ 0, పంత్ (సి)లాథమ్ (బి)హెన్రీ 20, కెఎల్ రాహుల్ (సి)బ్లండెల్ (బి)రూర్కే 0, జడేజా (సి)అజాజ్ పటేల్ (బి)హెన్రీ 0, అశ్విన్ (సి)ఫిలిప్స్ (బి)హెన్రీ 0, కుల్దీప్ (సి)బ్రాస్‌వెల్ (బి)హెన్రీ 2, బుమ్రా (సి)హెన్రీ (బి)రూర్కే 1, సిరాజ్ (నాటౌట్) 4, అదనం 4. (31.2ఓవర్లలో ఆలౌట్) 46పరుగులు. **వికెట్ల పతనం:** 1/9, 2/9, 3/10, 4/31, 5/33, 6/34, 7/34, 8/39, 9/40, 10/46 **బౌలింగ్:** సోధీ 6-4-8-1, హెన్రీ 13.2-3-15-5, రూర్కే 12-6-22-4.

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్‌బి)కుల్దీప్ 15, కాన్వే (బి)అశ్విన్ 91, యంగ్ (సి)కుల్దీప్ (బి)జడేజా 33, రచిన్ రవీంద్ర (బ్యాటింగ్) 22, మిఛెల్ (బ్యాటింగ్) 14, అదనం 5. (50 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 180పరుగులు. **వికెట్ల పతనం:** 1/67, 2/142, 3/154 **బౌలింగ్:** బుమ్రా 10-4-23-0, సిరాజ్ 7-1-21-0, అశ్విన్ 11-1-46-1, కుల్దీప్ 12-1-57-1, జడేజా 10-0-28-1.

న్యూజిలాండ్‌పై ఇండియా అత్యల్ప స్కోర్లు..

46 : బెంగళూరు, 2024
81 : వెల్లింగ్టన్, 1976
83 : మొహాలీ, 1999
88 : బ్రాబౌర్న్, 1965
89 : హైదరాబాద్, 1969
99 : హామిల్టన్, 2002

క్వార్టర్స్‌కు సింధు

డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



ఒడెన్సె(డెన్మార్క్) : డెన్మార్క్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి పివి సింధు దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో సింధు మూడుసెట్ల హోరాహోరీ పోరులో చైనా షట్లర్‌పై విజయం సాధించింది. తొలి గేమ్‌ను కోల్పోయిన సింధు.. ఆ తర్వాత వరుసగా రెండు గేమ్‌లు చేజిక్కించుకొని క్వార్టర్స్‌కు చేరింది. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో సింధు 18-21, 21-12, 21-16తో వై. హాన్(చైనా)ను చిత్తుచేసింది. బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్‌లోపై సింధు 18వ స్థానంలో ఉండగా.. వై. హంగ్ 7వ ర్యాంక్ క్రీడాకారిణి. శుక్రవారం జరిగే క్వార్టర్‌ఫైనల్లో పివి సింధు ఇండోనేషియాకు చెందిన టన్‌జంగ్‌తో తలపడనుంది.

ఫైనల్‌కు దక్షిణాఫ్రికా మహిళలు

సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాపై సంచలన విజయం



దుబాయ్: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్ సెమీస్‌లో దక్షిణాఫ్రికా పెను సంచలనాన్ని నమోదు చేసింది. డిఫెండింగ్ ఛాంపియన్, ఆరుసార్లు ఛాంపియన్ ఆస్ట్రేలియాకు దక్షిణాఫ్రికా మహిళలు ఝలక్ ఇచ్చారు. ఆస్ట్రేలియా నిర్దేశించిన 135పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 17.2 ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 135పరుగులు చేసి గెలిచింది. దీంతో దక్షిణాఫ్రికా మహిళల జట్టు తొలిసారి ఓ ఐసిసి టోర్నీ ఫైనల్లోకి దూసుకొచ్చింది. గురువారం జరిగిన తొలి సెమీఫైనల్లో దక్షిణాఫ్రికా మహిళలు ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాను దక్షిణాఫ్రికా బౌలర్లు కట్టడి చేశారు. దీంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 134పరుగులే చేసింది. వికెట్ కీపర్ మూనీ(44), కెప్టెన్ గ్రాత్(27), ఫెర్రీ(31) బ్యాటింగ్‌లో రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్లు ఖాకా(2/24), కాప్(1/24), మాబా(1/31) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఆ లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా మహిళలు సునాయాసంగానే ఛేదించారు. కెప్టెన్ వోల్వోడార్ట్(42), బోట్స్(74నాటౌట్; 48బంతుల్లో 8ఫోర్లు, సిక్సర్) గెలుపులో కీలకపాత్ర పోషించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బోట్స్‌కు దక్కింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68